# ప్రజాశక్తి శ్రీకాకుళం

ఆదివారం
జనవరి - 7
2018
12 పేజీలు




రామారావు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసు, తదితరులు

## రామారావు అందరికీ ఆదర్శం

**సంతాప సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజాశక్తిలో విలేకరిగా, డివిజన్ ఇన్‌ఛార్జిగా అంకితభావం, నిబద్ధతతో పనిచేసిన కీర్తిశేషులు జన్ని (4లో)

# జనం మెచ్చని జన్మభూమి

- అడుగడుగునా నిలదీతలు, బహిష్కరణలు
- ప్రభుత్వం, జన్మభూమి కమిటీలపై వ్యతిరేకత
- స్థానికుల ఆగ్రహాన్ని చవిచూస్తున్న అధికారులు, ఉద్యోగులు
- చేయని తప్పలకు సంజాయిషీ చెప్పకుంటున్న పరిస్థితి

**అభివృద్ధి, సంక్షేమం నినాదాలతో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమానికి అడుగడుగునా నిరసనల సెగ తగులుతోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. సమస్యలపై ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. చివరకు అధికారులనూ వదలడం లేదు. తమ సమస్యలను పరిష్కరించలేని సభలు వద్దంటూ కొన్నిచోట్ల జన్మభూమి సభలను సైతం బహిష్కరిస్తున్నారు. దీంతో జన్మభూమి నిర్వహణతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసుకుని లబ్ధి పొందుదామనుకున్న భావించిన ప్రభుత్వ లక్ష్యాన్ని గండి పడుతోంది.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి సంబంధించి 1255 చోట్ల సభలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకు 763 చోట్ల జరిగాయి. జన్మభూమి-మా ఊరు ప్రారంభమైన రెండో తేదీ నుంచి నిరసనలు, నిలదీతలు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల జన్మభూమి సభలను ప్రజలు అడ్డుకుంటున్నారు. తాగునీటి సమస్యలపై జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మిని శుక్రవారం పాలకొండలో నిలదీశారు. సీతంపేట మండలం సోమగండిలో శనివారం నిర్వహించిన జన్మభూమి సభలో రోడ్లు, తాగునీటి సమస్యలపై స్థానికులు ఆమెను నిలదీశారు. రాష్ట్ర రవాణశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కోటబొమ్మాళి మండలం (4లో)



సంతకవిటిలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

### ఆహారం కలుషితంపై

# కలెక్టర్ కన్నెర్ర

- ఎస్‌ఒ, ఎఎన్‌ఎం, హెడ్‌కుక్ సస్పెన్షన్
- పూర్తి నివేదిక అందించాలని ఎస్‌ఎస్‌ఎ అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - రాజాం

జి.సిగడాం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో చోటుచేసుకున్న కలుషిత ఆహార ఘటనపై కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి అధికారులు, ఉద్యోగుల బాధ్యతా రాహిత్యంపై శనివారం చర్యలకు ఉపక్రమించారు. కెజిబివి పాఠశాల ప్రత్యేకాధికారి పి.శిరీషతో సహా ఇతర సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆహారం కలుషిత మైందన్న ప్రాథమిక నివేదికపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. ప్రత్యేకాధికారి పి.శిరీష, ఎఎన్‌ఎం జి.కుమారి, హెడ్ కుక్ ఎర్ర బాపమ్మను సస్పెండ్ చేశారు. పాఠశాలలో అపారిశుధ్యం తాండవిస్తోందని, దీనిపై గతంలో నాలుగు సార్లు మెమోలు కూడా జారీ చేసినా, స్పందన లేదని సర్వశిక్షా అభియాన్ పిఒ త్రినాథరావు నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు. తదుపరి విచారణలో నిర్లక్ష్యానికి వీరే కారకులైతే వారిని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. పాఠశాలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించి, పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

**ఇదీ ఘటన...**

జి.సిగడాం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో (మిగతా...4లో)



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తున్న వైద్యులు

### మోటారు వాహన చట్టాన్ని

# సవరించవద్దు

**ఆటో వర్కర్స్ యూనియన్ ధర్నా**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మోటారు వాహన చట్టాన్ని సవరించి, మోటారు రంగ కార్మికులను అన్యాయం చేయొద్దని సిఐటియు శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి టి.తిరుపతిరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని డే అండ్ నైట్ కూడలిలో గల ఆటోస్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆటో కార్మికులు శనివారం (మిగతా...4లో)




ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

### అటవీ సంరక్షణ

# బాధ్యత మీదే...

- ఉత్తరాంధ్రలో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- అటవీశాఖ అధికారుల సమీక్షలో ప్రిన్సిపల్ సిసిఎఫ్ మల్లిఖార్జునరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అడవుల సంరక్షణ బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిదేనని ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పి.మల్లిఖార్జునరావు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని డివిజనల్ అటవీశాఖ కార్యాలయంలో మూడు జిల్లాల అటవీశాఖ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలు అడవుల అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని, అందువల్ల ప్రత్యేక శ్రద్ధతో మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సముద్రతీరం వెంబడి (మిగతా...4లో)

# మారుమూల గిరిజనులకు గ్యాస్

## జెసి చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-భామిని

మండల కేంద్రంలో హెచ్‌పిసిల్ గ్యాస్ ఏజెన్సీ నిర్మాణ పనులను జెసి చక్రధర్‌బాబు పౌర సరఫరాలశాఖాధికారి మోహనరావు శనివారం పరిశీలించారు. నిల్వ సామర్థ్యం,సౌకర్యాలు వంటి వాటి ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ నిర్వాహకులు కోరాడ.రాజేష్‌తో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాలకు కూడా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. భామిని నుండి మెలియాపుట్టి వరకు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. పక్కా గృహాలన్నింటికి ఉచిత కనక్షన్లు అందజేయాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న గృహాలకు కనక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యం, విఆర్‌ఒ గిరి తదితరులున్నారు.



గోదామును పరిశీలిస్తున్న జెసి

## ఉపాధి కల్పించడంలో అలసత్వం

**భామిని:** ఉపాధిని కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనీ మండలంలోని తాళాడ గ్రామస్తులు అధికారులను శనివారం నిలదీశారు. తాళాడలో జన్మభూమి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన కౌలు రైతు కిరణ్ మాట్లాడుతూ గతేడాది కాలంగా ఉపాధి పనులు సక్రమంగా జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీటి ఇంజన్లు ఇచ్చేందుకు టిడిపి నాయకుల అండ కావాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లేశ్వరరావు, తహశీల్దార్ సత్యం పాల్గొన్నారు.

## అధికారులను నిలదీత

ప్రజాశక్తి-కొత్తూరు

మండలంలోని ఇరపాడు నిర్వాసితులు అధికారులను నిలదీశారు. శనివారం మండలంలోని గొట్టిపల్లి, గూనభద్ర, లబ్బ, ఇరపాడు గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఇరపాడులో జరిగిన జన్మభూమిలో నిర్వాసితులు సమస్యలపై ఏకరువుపెడుతూ తహశీల్దార్ ఎం.సావిత్రిని నిలదీశారు. కనీసం మంచినీరు, విద్యుత్ మీటర్లు, మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ధ్వజమెత్తారు. దీంతో ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజేశ్వరరావు, ఇఒపిఆర్‌డి నారాయణమూర్తి, ఆర్‌ఐ కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి రవినాయుడు, అప్పారావు, మోహనరావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సోమగండిలో 'జన్మభూమి' బహిష్కరణ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని సోమగండి పంచాయతీలో జన్మభూమి కార్యక్రమంలో అధికారులను అడ్డుకుంటూ గిరిజనులు సభను శనివారం బహిష్కరించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ధనలక్ష్మి హాజరయ్యారు. అయితే కనీసం తాగు నీరు, రోడ్లు సమస్యలున్నాయనీ, కార్యాలయాల చుట్టూ పలు మార్లు తిరిగినా పరిష్కరించడం లేదని గ్రామస్తులు పెద్దఎత్తున నిలదీశారు. పింఛన్లు అందక, గృహాలు, ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కడగండి, శంభాం పంచాయతీల్లో బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దనీ, ఆ తీర్మానం ఉపసంహరించుకోవాలని సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, గ్రామస్తులు జన్మభూమిని బహిష్కరించారు. ఎంపిడిఒ రాధాకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. కొండాడ పంచాయతీలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మక జయకృష్ణ, సర్పంచ్ సుగుణ, కనీస వేతనాల రాష్ట్ర సలహామండలి సభ్యులు బిడ్డిక దమయంతినాయుడు, తదితరులున్నారు.

## చింతాడలో సమస్యలపై నిలదీత

**పాలకొండ:** మండలంలోని చింతాడ గ్రామంలో శనివారం జరిగిన జన్మభూమి గ్రామసభలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రసాదరావు, గిరిజన సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్‌ఎస్.మూర్తికి సమస్యలపై గ్రామస్తులు నిలదీశారు. ఇంకుడు గుంతలు నిర్మించుకున్నా బిల్లులు చెల్లించలేదని వారు సభలో నిలదీశారు. 16 మంది అర్హులకు బిల్లులు అందించలేదన్నారు. దీనిపై స్పందించిన ఎపిఒ విద్యాసాగర్ మాట్లాడుతూ వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి

## జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం

ప్రజాశక్తి-జలుమూరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం సూచించారు. మండలంలోని కూర్మనాథపురం గ్రామంలో సర్పంచ్ రామలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో సాయిరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి కుటుంబమూ ఒక వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఎంపిడిఒ వాసుదేవరావు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ శిమ్మ. గరికమ్మ అధ్యక్షతన జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ కె.ప్రవళికప్రియ ఆధ్వర్యంలో నగరికటకం, మర్రివలస గ్రామాల్లో ఆయా సర్పంచ్లు బేరి.ప్రసాదరావు, బగ్గు.సత్యవతమ్మ అధ్యక్షతన జన్మభూమిని నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన రేషన్‌కార్డులను, చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

## నేడు తెరవనున్న పాఠశాలలు

**టెక్కలి:** జన్మభూమి సందర్భంగా టెక్కలిలోని ప్రభుత్వ పాఠశాలలను ఆదివారం కూడా పనిచేయాలని డిఇఒ ఆదేశాలు జారీ చేశారు. గ్రామసభలు జరిగే ప్రాంతాల్లో పాఠశాలలు తెరవాలనీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు.

## సమస్యల్లేకుండా చర్యలు

**హిరమండలం:** రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగు నీటి సమస్యల్లేకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామనీ గ్రామీణ నీటి పథకం ఎస్ఇ పి.రవి అన్నారు. శనివారం మండలంలోని హిరమండలం మేజర్ పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మాణం జరుపుతున్న రెండు లక్షల లీటర్ల మంచి నీటి పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ మేరకు పనుల్లో ఎలాంటి నాణ్యతతో పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ ఏడాది మే నెల నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈయనతో ఇఇ టిఎస్.ప్రసాద్,ఎఇ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ

# గిరిజనులకు అండగా ఉంటాం

## ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజనులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే వి.కళావతి, వైఎస్‌పి రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెడ్డి శాంతి అన్నారు. బోయ, వాల్మీకీలను ఎస్‌టిల్లో చేర్చొద్దని గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద గిరిజనులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఎమ్మెల్యే, రెడ్డి శాంతి వారి దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ, ఇంకా వెనుకబాటు తనంలోనే ఉన్నారనీ, బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చితే మరింత వెనుకబాట పడతారన్నారు. ఈ సమస్య పట్ల గిరిజనులకు మద్దతుగా నిలుస్తామన్నారు. ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసమే ఇలా చేస్తుందనీ, పార్టీలకు అతీతంగా సమస్యను ఉపసంహరించుకునే వరకు పోరాడాలన్నారు. ఈమెతో పాటు గిరిజన సంఘం అధ్యక్షులు పత్తిక కుమార్, ఎంపిటిసి లక్ష్మి, సర్పంచ్ అయిన్ని, గిరిజన ఐక్యవేదిక నాయకులు ప్రసాద్, నిమ్మక కాంతారావు, ఆరిక సూర్యనారాయణ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న రెడ్డి శాంతి, కళావతి

## చదువులో రాణించాలి

**ఇచ్ఛాపురం:** విద్యార్థినులు చదువులో రాణించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పుస్తకాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు పెద్దపీట వేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికల్లో మానసిక ఏకాగ్రత చాలా అవసరమన్నారు. సదస్సులో కస్తూరిబా పాఠశాల అధికారిణి ఆర్.వాసంతి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీతయ్య, దేవరాజు, ఎస్.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**నందిగాం:** చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని రామపురం పంచాయతీ పరిధిలోని జయపురం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జడ్జి మాట్లాడుతూ చట్టాలను గౌరవించాలన్నారు. చిన్నచిన్న తగాదాలకు కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని వథా చేసుకోవద్దని తగాదాలకు దూరంగా ఉంటే శ్రేయస్కరమన్నారు. రాజీ మార్గమే ఉత్తమ మార్గం అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెండి. గోరీ అరుణకుమార్, పినకాన.అజయ్‌కుమార్, దవళ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

చంద్రబాబు పర్యటన అనంతరం ఇచ్ఛాపురంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శనివారం కార్మివీధిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సోంపేట- కవిటి-ఈదుపురం రోడ్డు అభివృద్ధికి రూ.31.80 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. బూర్జిపాడు వద్ద లోకాజీవే నిర్మాణానికి రూ.ఏడు కోట్లు, సిలగాం వద్ద కొబ్బరి కోకోనట్ పార్కును సిఎం మంజూరు చేశారన్నారు. కొబ్బరి రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన ధర లభించకపోవడంతో దళారులతో నష్టపోతున్నారన్నారు. కోకోనట్ పార్కుతో ధరలను స్థిరీకరణ చేసి ఉత్పత్తులు అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలోని 23 మత్స్యకార గ్రామాల్లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కిడ్నీ రోగులు సౌకర్యార్థం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సమీపంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. శాశ్వత తాగునీటి ఏర్పాటుకు రూ.2.50 కోట్లతో సమగ్ర నివేదిక తయారుచేశామన్నారు. ఇచ్ఛాపురంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 30 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎల్లప్పుడూ టిడిపికి కంచుకోట అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో విజయఢంకా మోగిస్తుందని జోస్యం చెప్పారు. సిఎం పర్యటన విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

# రాజకీయ లబ్ధి కోసమే 'ధర్మాన' ఆరాటం

## మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ



మాట్లాడుతున్న మాజీమంత్రి అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పదవిలో లేనన్న ఆక్రోషంతోనే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆరోపించారు. శనివారం అరసవల్లిలోని నియోజకవర్గం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తన కుటుంబంపై బురద జల్లి లబ్ధిపొందాలని ధర్మాన ఆశపడుతున్నారని, ఆ ఆశ తీరదని చెప్పుకొచ్చారు. ఏనాడూ తన కుటుంబం అవినీతిని ప్రోత్సహించదని, గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ పదేళ్ల దోచుకున్న వారంతా ఆయన పంచన చేరి ఇప్పుడు ప్రచారం కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్ హోటల్‌కు భూములిచ్చిన ధర్మానకు అరసవల్లి ఆలయం భూములని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. భూ ఆక్రమణలు జరిగి ఉంటే రెవెన్యూ మంత్రిగా గతంలో పనిచేసిన ధర్మానకు చట్టం గురించి తెలుసన్నారు. కలెక్టర్ స్థాయి అధికారి ఈ భూముల్లో ఎటువంటి అక్రమాలు లేవని చెప్పినా రాజకీయ లబ్ధికోసం బలప్రదర్శన నిర్వహించారన్నారు. గతంలో భూములు ఆక్రమించిన చరిత్ర ఉన్న వారు బడ్జెట్ హోటల భూముల గురించి వాస్తవాలు తెలుసు కోకుండా మాట్లాడుతున్నారని ఘాటైన సమాధానమిచ్చారు. సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కెల్ల కొండలరావు, సరిబాబు పాల్గొన్నారు.

## మహిళపై టిడిపి నాయకుల దాడి

**భామిని :** మండలంలోని సతివాడకు చెందిన పతివాడ పగడాలమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీకాంత్ అలియాస్ భూపతి అతని తండ్రి సంజీవరావులు కలిసి దాడి చేయడంతో పాటు వేధింపులకు పాల్పడుతున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ ముకుందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ కథనం మేరకు... పగడాలమ్మ ఇంటి ముందు ప్రొక్లెయినర్‌తో కాలువను తవ్వుతున్నారు. ఈ సందర్భంగా కంచె తీసే వరకు ఆగమని ఆమె కోరింది. దీంతో శ్రీకాంత్ రెచ్చిపోయి ఆమెపై దుర్భాషలాడి దాడికి పాల్పడ్డాడు. గతంలోనూ ఇరువురి మధ్య తగాదాలున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



దగ్ధమైన సామగ్రి

## బెజ్జిపురంలో కిరాణ దుకాణం దగ్ధం

**లావేరు:** మండలంలోని బెజ్జిపురం దళితవాడలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో జామి సురేష్‌కు చెందిన కిరణా దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. శనివారం ఉదయం బాధితుడు దుకాణాన్ని తెచ్చేందుకు వెళ్లి చూసేసరికి అప్పటికే దుకాణంలోని సామగ్రి కలిపోయి ఉన్నాయి. ఈ ప్రమాదంలో రూ.5 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది. సంక్రాంతి సందర్భంగా కొత్త సామగ్రిని తెచ్చి షాపులో ఉంచానని, దీంతో తీవ్రంగా నష్టపోయానని బాధితుడు బోరున విలపిస్తున్నాడు. విషయం తెలుసుకున్న విఆర్ఒ బి.శంకరరావు పరిశీలించి ఆస్తినష్టం అంచనా వేశారు.

## ప్రజా ఉద్యమాల్లో 'మార్పు' చిరస్మరణీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాంతత్ర్య ఉద్యమ కాలం నుంచి కమ్యూనిస్టు భావజాలాన్ని అందుకుని ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాల్లో జైలు జీవితాన్ని గడిపిన మార్పు బాలకృష్ణమ్మ చిరస్మరణీయులని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. శనివారం సాయంత్రం నగరంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో జరిగిన మార్పు బాలకృష్ణమ్మ 5వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల తరపున చట్టసభల్లో అనేక అంశాలపై పోరాడిన చరిత్ర ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో ఉపాధ్యాయ ఉద్యమాలను కొనసాగిస్తామన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి కళా పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ కెధనంజయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం విశాఖపట్నం సర్క్యూట్ హౌస్ నుంచి బయలుదేరి జిల్లాలోని రణస్థలం మండలం వి.ఎన్.పురం గ్రామానికి చేరుకుని రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం రణస్థలంలో నిర్వహించనున్న జన్మభూమి కార్యక్రమంలో హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జి.సిగడాం మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. సాయంత్రానికి రాజాంలోని జిఎంఆర్ అతిథిగృహానికి చేరుకుని రాత్రికి రాజాంలో బస చేస్తారని పేర్కొన్నారు.

## రాయితీపై మొక్కజొన్న విత్తనాలు

### 'ఆత్మా' పీడీ ప్రమీల

ప్రజాశక్తి- లావేరు

రైతులందరికీ రాయితీపై మొక్కజొన్న విత్తనాలను అందిస్తామని, సాగు విస్తర్ణాన్ని పెంచాలని ఆత్మా పీడీ ప్రమీల అన్నారు. మండలంలోని శనివారం కొత్తకోట, గోవిందపురం, అదపాక, బుడుమూరు గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సేంద్రియ ఎరువులను రైతులు ఉపయోగించాలన్నారు. జన్మభూమి ప్రత్యేకాధికారి పీడీ వి.రత్నకుమార్, మండల ప్రత్యేకాహ్వానితులు ముప్పిడి సురేష్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమం ఒక వేదిక అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎంపిడిఒ ఎం.కిరణ్‌కుమార్, తహశీల్దార్ సనపల సుధాసాగర్, జెడ్‌పిటిసి భర్త పి.మధుబాబు, ఎఒ ఆర్.అప్పారావు, సర్పంచ్ ఎన్.కుమారి, అప్పల నాయుడు, ఇఒపిఆర్‌డి శ్యామలకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆత్మా పీడీ ప్రమీల

# వివేకానందుని బోధనలపై అధ్యయనం

## జెసి-2 రజనీకాంతారావు పిలుపు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రజనీకాంతారావు, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వివేకానందుని బోధనలపై విద్యార్థులు అధ్యయనం చేయడంతో పాటు భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్-2 పి.రజనీకాంతారావు పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా వివేకానందుని జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ వేదికపై భారతీయ యువతకు ఆదరణ ఉందని, సృజనాత్మకత ఇక్కడివారి సొంతమన్న భావన ఉందని అన్నారు. విశ్వవేదికపై దేశ ఔన్నత్యాన్ని ప్రదర్శించిన ఘనత వివేకానందుని బోధనలకు ఉందన్నారు. అటువంటి బోధనలను నేటి విద్యార్థులు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద భావప్రచార పరిషత్తు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో దేవభూషణరావు, గేదెల ఇందిరాప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బాబూరావు, మందపల్లి రామకృష్ణ, నటుకుల మోహన్, జి.మురళీమోహనరావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్థానిక పిఎస్ఎన్‌హెచ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చౌదరి రమణి, యువజన కాంగ్రెస్ నాయకులు చౌదరి సతీష్ పుస్తకాలు, పెన్నులు, స్టడీ మెటీరియల్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రోత్సహించేందుకు, వారు మరింతగా రాణించేందుకు ఏటా తనకు తోచిన రీతిన వీరికి సాయం చేస్తున్నానని అన్నారు. మార్కుల సాధనే ధ్యేయంగా ఒత్తిడికి గురికావద్దని హితవు పలికారు. పరీక్షల సమయంలో నిద్రమాని గంటల తరబడి చదవడం అంత మంచిది కాదన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు సతీష్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సదాశివుని శంకరరావు, పీడీ పైడి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చౌదరి సతీష్

## నేత్ర వైద్య శిబిరానికి స్పందన

**రాజాం :** పట్టణంలోని కాలెపువీధి తదితర ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజాం సామాజిక ఆస్పత్రి కంటి విజన్ సెంటర్ ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వాసుదేవరావు కూడా చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.

# బాలికల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని వావాం పంచాయతీ ఉవ్వపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్క బాలిల బాలికల హక్కులపై అవగాహన పెంపొందించు కునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండక ముందే పెళ్లిళ్లు చేస్తున్నారని, వాటిని విద్యార్థులే ఆపే విధంగా చూడాలని అన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పిస్తున్నామని, మరిన్ని గ్రామాలను దత్తత తీసుకుని గ్రామీణులు అభివృద్ధి చెందేటట్లు చూడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొల్వి జ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూక సన్యాసిరావు

## పాఠశాలలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని వాల్తేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నీలంనాయుడు ఆధ్వర్యాన విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ ఇంటి పనుల్లోనే కాకుండా ఆట, పాటలు, చదువులోనూ, వివిధ రంగాల్లో ముందుండి అన్ని విభాగాల్లో విజయాలు సాధించాలన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన రజిని, దీపిక, ఇంద్రజ, కె.రాజులమ్మకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు దుస్తులు పంపిణీ

**ఆమదాలవలస:** పట్టణంలోని సాహితీనగర్‌లోని పొన్నాడ అప్పలనర్సమ్మ సేవా సంస్థ ఆధ్వర్యాన 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం పొన్నాడ అప్పలనర్సమ్మ, చిన్నవాడు 90వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి వనరుల సంఘం బోర్డు డైరెక్టర్ మొదలవలస రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదలకు దుస్తులు పంపిణీ చేయడం మంచి తరుణమన్నారు. కార్యక్రమంలో బిఆర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాత్రుని పాపారావు, వై.లక్ష్మీనారాయణ, బి.హెచ్.ఆదినారాయణ, పి.విజయ, జి.సింహాచలం, బి.మధుసూదనరావు పాల్గొన్నారు.

## డోలపేటలో వ్యాసరచన పోటీలు

**రాజాం :** జన్మభూమి కార్యక్రమంలో భాగంగా శనివారం డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఇందులో విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నామని స్కూల్ హెచ్ఎం వి.వి.వసంతకుమార్ తెలిపారు.

### కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

స్థానిక డోలపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు జిఎంఆర్ఐటి ఫౌండేషన్ తరుపున గమ్యం టీమ్ సభ్యులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో వారి లక్ష్యాన్ని సాధించాలంటే ఇంటర్‌లో ఎటువంటి గ్రూపు తియ్యాలనే ప్రశ్నలకు ఐటి విద్యార్థులు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న యుగంధర్

## నైతిక విలువలే ముఖ్యం

**హిరమండలం :** వ్యక్తిత్వ వికాసానికి నైతిక విలువలే ముఖ్యమని శ్రీరామేశ్వరి విద్యాసంస్థల ప్రిన్సిపల్ ఎల్.యుగంధర్ అన్నారు. మండలంలోని హిరమండలం మేజర్ పంచాయితీలోని సుభలాయి, నౌగుడ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ప్రిన్సిపల్ యుగంధర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు భావోద్వేగాలను అదుపు చేసుకోవడంలో విఫలమై ఒత్తిడికి గురవుతున్నారన్నారు. స్వీయ క్రమశిక్షణతో పాటు యోగా తదితర ప్రక్రియల ద్వారా సహనం, ఏకాగ్రత అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు బి.సురేష్, బి.ఉమామహేశ్వరరావు, పి.యతిరాజులు, కరస్పాండెంట్ ఆర్.గోపాలరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్మభూమి సభలా...? టిడిపి సభలా..?

పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి

**పాలకొండ :** ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి గ్రామసభలు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లా జరుగుతున్నాయని స్థానిక శాసనసభ్యులు విశ్వసరాయి కళావతి ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను పట్టించుకోకుండా ఎటువంటి పదవుల్లో లేనివారిని సభా వేదికలపైకి ఆహ్వానించడం సరికాదన్నారు. ఇది చాలా దుర్మార్గమైన చర్యన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా నియోకవర్గంలో అధికారులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే అసంతృప్తి చెందారు. పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, ఎంపిపి భర్త వారాడ సుమంత్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు వంటి నాయకులు సమావేశాలకు హాజరై వేదికలపై కూర్చోవడం సిగ్గుచేటన్నారు. అలాగే పార్టీ ప్రచారాలకే జన్మభూమిని ఉపయోగించుకుంటున్నట్లు ఆమె ఆరోపించారు. గత జన్మభూముల్లో అర్జీదారుల నుంచి అందిన సమస్యలను ఇప్పటి వరకు పరిష్కరించలేదని ఆమె తెలిపారు.

## 'చంద్రన్న బీమా' అందజేత

**కంచిలి :** మండలంలోని పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన మాదిన కల్పనకు సర్పంచ్ మాదిన రామారావు శనివారం చంద్రన్న బీమా నగదును అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన మాదిన మధుబాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్యకు ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.ఐదు వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు బీమా మిత్ర శ్రీదేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**పలాస:** మున్సిపాలిటీలోని 11వ వార్డుకు చెందిన బి.పైడిరాజు ఇటీవల మృతి చెందాడు. ఆయన భార్య జ్యోతికి శనివారం చైర్మన్ కోత పూర్ణచంద్రరావు చంద్రన్న బీమా కింద రూ.ఐదు వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో బీమా మిత్ర తులసి, బి.శ్రీనివాసరావు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే...

**ప్రజాశక్తి - టెక్కలి**

పంచాయితీల్లోను గ్రామాల్లో నున్న సమస్యలు పరిష్కారానికే జన్మభూమి క్మ మా ఊరు గ్రామ సభలని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఒ ఎం.వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం రావివల్లాభాపురం, తిర్లంగి పంచాయితీల్లో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయనున్నామని తెలిపారు. సర్పంచ్‌లు బగాది రమాదేవి దవళ రజనీల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అందించిన పథకాలను,చంద్రన్న బీమా బాండ్లను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి మట్ట సుందరమ్మ,జడ్‌పిటిసి కర్నిక సుప్రియ, టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరి, ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, నాయకులు మామిడి రాము, చాపర గణపతి, గుంట బాబురావు, తిర్లంగి సర్పంచ్ ధవళ రజని, ప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

**హిరమండలం :** జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుఎస్ఎన్.మూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జన్మభూమి కార్యక్రమంలో చివరి రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## వీరఘట్టంలో ఎగ్జిబిషన్

**వీరఘట్టం :** మండలంలోని పివిఆర్‌పురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, ఉపాధ్యాయులకు బయోమెట్రిక్, గ్యాస్ స్టవ్, పుస్తకాలు తదితరమైనవి ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేయడంతో మండల ప్రత్యేకాధికారి వైవి.శ్యామ్‌కుమార్, తహశీల్దార్ ఎంవి.రమణ ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## మరుగుదొడ్డి తప్పనిసరి

**సోంపేట:** ప్రతి కుటుంబమూ వ్యక్తిగత మరుగుదొడ్డు నిర్మించుకోవాలని ఎన్ఎస్ఎస్ పిఒ అరుణ్‌కుమార్ అన్నారు. కుమ్మరిపేటలో చేపడుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో శనివారం ఆయన పాల్గొని మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

## జనం మెచ్చని 'జన్మభూమి'

యలమంచిలిలో పంచాయతీ అభివృద్ధిపై టిడిపి నాయకులు వివక్ష చూపుతున్నారంటూ గ్రామస్తులు జన్మభూమి సభను బహిష్కరించారు. వీటితో పాటు సీతంపేట, ఇతర ప్రాంతాల్లో జన్మభూమి సభలను గ్రామస్తులు బహిష్కరించారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు, కూలి డబ్బులు చెల్లించడం లేదని ఉపాధి హామీ కూలీలు జన్మభూమి సభలో నిలదీస్తున్నారు.

**స్థానికుల ఆగ్రహానికి గురవుతున్న అధికారులు, ఉద్యోగులు**

ప్రభుత్వం ఒకటి తలిస్తే, జన్మభూమి సభల్లో మరొకటి జరుగుతోంది. సభల నిర్వహణతో ప్రభుత్వానికి, పార్టీకి క్రెడిట్ దక్కుతుందని భావిస్తే, అందుకు విరుద్ధంగా చేదు ఫలితాలు వస్తున్నాయి. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంతో ప్రభుత్వానికి లబ్ది చేకూరకపోగా అధికారులకు, ఉద్యోగులకు పాట్లు తప్పడం లేదు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వారు చవిచూడాల్సి వస్తోంది. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అభివృద్ధిలో వివక్షపై స్థానికుల ఆగ్రహానికి వారు గురవుతున్నారు. జన్మభూమి కమిటీ నాయకుల నిర్ణయాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారి కోపానికి అధికారులు, ఉద్యోగులు గురవుతున్నారు. అన్నింటికీ వారే సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తోంది.

**పాలనపై తీవ్ర ప్రభావం**

జన్మభూమి సభలతో అటు సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పలు పనుల కోసం కార్యాలయాలకు వెళ్తున్న వారికి నిరాశ తప్పడం లేదు. మండల స్థాయి అధికారులంతా గ్రామాల్లో ఉండడంతో, ఒక్క పనీ జరగడం లేదు. ప్రజలు ఈ రకమైన ఇబ్బంది పడుతుంటే, అధికారులు మరో సమస్యను ఎదుర్కొంటున్నారు. రోజంతా జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొనడంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. దీంతో పాలనా వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**జన్మభూమి కమిటీ సభ్యుల తప్పిదాలకు అధికారుల సంజాయిషీ**

ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి సభలను నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెప్తోంది. వారి సమస్యలేమైనా పరిష్కారమవుతున్నాయా అంటే అదీ లేదు. పోనీ అక్కడికక్కడ అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, దీపం కనెక్షన్లు తదితర సంక్షేమ పథకాలను మంజూరు చేసే అధికారం అధికారులకు ఎంతవరకు ఉందనేది అందరికీ తెలిసిందే. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటికీ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నది జన్మభూమి కమిటీ సభ్యులేనన్న విషయం అందరికీ తెలిసిందే. వారి సిఫార్సు లేకుండా ఏ ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకం దక్కే పరిస్థితి లేదన్న విషయం అందరికీ తెలిసిందే. అర్హులకు పథకాలు అందలేదంటే దానికి జన్మభూమి కమిటీ సభ్యులే బాధ్యత వహించాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న జన్మభూమి సభల్లో మండల స్థాయి అధికారులు వాటికి జవాబు చెప్పుకోవాల్సి వస్తోంది. గ్రామాల్లో స్థానికుల నుంచి పెల్లుబికుతున్న ఆగ్రహాన్ని వారు చవిచూస్తున్నారు. చేయని తప్పుకు వారు సంజాయిషీ చెప్పుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, అసహనం పెరిగే అవకాశాలు లేకపోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్ది, వారు పని వారు చేసుకునేలా స్వేచ్ఛనివ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## రామారావు అందరికీ ఆదర్శం

రామారావు అందరికీ ఆదర్శం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు అన్నారు. ఈనెల ఒకటో తేదీన హఠాన్మరణం చెందిన రామారావు సంతాప సభను ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తికి ప్రకటనల సేకరణలో పలాస డివిజన్‌ను రామారావు అగ్రస్థానంలో నిలిపారని చెప్పారు. విలేకరులను ప్రోత్సహిస్తూ, పనిలో భాగస్వామ్యం కావడం ద్వారానే ఇది సాధించగలిగారన్నారు. విప్లవోద్యమాలకు అంకితమైనందునే అన్ని రంగాల్లోనూ ఆయన రాణించగలిగారని కొనియాడారు. రామారావు ఒరవడిని అందరూ అందిపుచ్చుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామారావు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. ప్రజాశక్తిలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగిని కోల్పోవడం సంస్థకు తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అందరితో సత్సంబంధాలను కొనసాగిస్తూ వృత్తిలో బాగా రాణించారని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు సత్తారు భాస్కరరావు మాట్లాడుతూ విలేకరులకు పని అప్పగించడం, పని బాధ్యతలు తీసుకోవడం రామారావుకు ఉన్న మంచి లక్షణాలని చెప్పారు. ఎడిషన్ సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఎ.సోమశేఖరరావు మాట్లాడుతూ రామారావులో ఉన్న అంకితభావం, సమయపాలన, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని పనిలో ముందుకు సాగాలన్నారు. తొలుత రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సభకు స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు స్వాగతం పలకగా, ఎడివిటి ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు వందన సమర్పణ చేశారు. సభలో ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ కన్నెర్ర

ఈనెల నాలుగో తేదీన మధ్యాహ్నం

## మొదటి పేజీ తరువాయి

విద్యార్థినులకు పులిహోర వండి పెట్టారు. భోజనం తిన్న కొద్దిసేపటి తర్వాత 40 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, జ్వరం, తలనొప్పితో అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. పాఠశాలలోనే జి.సిగడాం పిహెచ్‌సి వైద్యులతో మాత్రలు, ఇంజెక్షన్లు ఇచ్చి రెండు రోజులు సరిపెట్టారు. శుక్రవారం రాత్రికి పరిస్థితి విషమించడంతో ప్రత్యేకాధికారి పి.శిరీష విద్యార్థులను రాజాంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు.

రాజాం సామాజిక ఆస్పత్రిలో విద్యార్థినులకు వైద్యసేవలు అందుతున్న తీరుపై ఐటిడిఎ పిఒ ఎల్.శివశంకర్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సనపల తిరుపతిరావు, సర్వశిక్షా అభియాన్ పిఒ ఎస్.త్రినాథరావు, స్టేట్ ఈక్విటీ కన్సల్టెంట్ పి.గీత, జిసిడిఒ భారతి, సత్యవతి, సిఎంఒ ఎం.శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు.

**ఎస్ఒ నిర్లక్ష్యమే కారణం**

కెజిబివి పాఠశాలలో కలుషిత ఆహారానికి ప్రత్యేకాధికారి శిరీష నిర్లక్ష్యమే కారణమని మహిళా కమిషన్ సభ్యురాలు కొయ్యాన శ్రీవాణి అన్నారు. పాఠశాలలో అపారిశుద్యం, ఆహార పదార్థాలను వండడంలో శుభ్రత, జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ మహంతి చంద్రశేఖర్‌నాయుడు, చిన్నపిల్లల వైద్య నిపుణులు వాసుదేవరావు తదితరులున్నారు.

## బాధ్యత మీదే...

మడ అడవులను అభివృద్ధి చేయడం వల్ల ప్రకృతి విపత్తుల నుంచి రక్షించుకునేందుకు వీలవుతుందన్నారు. తీరం వెంబడి పెద్దఎత్తున సరుగుడు, తాటిచెట్ల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 20 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రాధాన్యతా క్రమంలో నర్సరీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో ఏనుగుల సంచారం ఉందని, ఏనుగుల సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే ట్రాకర్లను నియమించిందని వెల్లడించారు. పదేళ్లుగా వేధిస్తున్న ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని బాధితులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఏనుగులను గ్రామాల దరి చేరకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. మిరప, పొగాకు సాగు ఉంటే ఆ ప్రాంతానికి ఏనుగులు రావని గత అధ్యయనాల్లో గుర్తించినట్లు తెలిపారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఈ పంటల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా రాష్ట్రంలో 1700 కిలోమీటర్ల పొడవున కందకాలు తవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

**సామాజిక అటవీశాఖాధికారిపై విచారణ**

జిల్లా సామాజిక అటవీశాఖాధికారిగా పనిచేస్తున్న ధనుంజయపై వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. గతంలో పనిచేసిన ప్రాంతాలతో పాటు జిల్లాలో పలువురు అతనిపై ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండేను విచారణాధికారిగా నియమిస్తూ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. జిల్లా సామాజిక అటవీశాఖ ఖాతాల్లో నిధులు దుర్వినియోగమైనట్లు వచ్చిన అభియోగాలను విచారించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సిసిఎఫ్ రాహుల్‌పాండేతో పాటు విశాఖ డిఎఫ్ఒ అలంజాంగ్‌టెరాన్, విజయనగరం డిఎఫ్ఒ లచ్చన్న, సిహెచ్ సూర్యనారాయణ, శ్రీకాకుళం డిఎఫ్ఒలు శాంతిస్వరూప్, ధనుంజయ, రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

## సవరించవద్దు

ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ఎంవిఐ చట్టాన్ని కార్మికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని స్పష్టం చేశారు. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభలో పాస్ కాలేదని గుర్తుచేశారు. ఇప్పటికే ఆటో, మోటార్ కార్మికులపై ప్రభుత్వం రిజిస్ట్రేషన్, సేవా రుసుము పేరిట అధిక మొత్తాలను వసూలు చేస్తోందని విమర్శించారు. లేట్ ఫీజు పేరుతో రోజుకు రూ.50 వసూలు చేస్తుందని దుయ్యబట్టారు. రవాణాశాఖ పెంచిన సేవా రుసుములను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై రవాణాశాఖ విధిస్తున్న ఆంక్షలను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిదో తరగతి నిబంధనను సడలించి లైసెన్సులు జారీ చేయాలన్నారు.

రవాణా రంగాన్ని దివాళా తీయించే సంస్కరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో, రవాణారంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారాలు వేస్తున్నాయని విమర్శించారు. 894 జిఒ థర్డ్‌పార్టీ బీమా పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రవాణా రంగాన్ని కార్పొరేటీకరణ చేసే ఆలోచనలను విరమించుకోకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఆటో కార్మికులు శ్రీను, రమణ, రాజు, సత్యనారాయణ, రాజారావు, జగన్, రామచంద్రరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు న్యాయ సహాయం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ**

**ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్**

జిల్లాలోని నిరుపేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందేలా చర్యలు చేపడతామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు వి.బి.నిర్మలాగీతాంబ ప్యానల్ లాయర్లకు సూచించారు. శనివారం జిల్లా న్యాయస్థానంలో ప్యానల్ లాయర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిఆపరు. ఈ శిక్షణలో అనుభవం గల మాస్టర్ ట్రైనీలతో ప్యానల్ లాయర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు



మాట్లాడుతున్న నిర్మలాగీతాంబ

చెప్పారు. శిక్షణ పొందుతున్న లాయర్లందరూ నిరుపేద ప్రజలకు న్యాయ సహాయం, సలహాలు అందించాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి మాట్లాడుతూ శిక్షణలో పలు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.సత్యనారాయణ, విశాఖపట్నం, ఏలూరు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనీలు ఆర్.శ్రీనివాసరావు, టి.సుబ్బారావు, ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి బి.గౌమ్‌ప్రసాద్, ఫ్యామిలీ కోర్టు కమ్ థర్డ్ జిల్లా జడ్జి వి.గోపాలకృష్ణరావు, లోక్‌అదాలత్ చైర్మన్ సి.బి.సత్యనారాయణ, ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ జడ్జి పి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.


వంటలు చేస్తున్న విద్యార్థులు

## విద్యార్థులకు వంటల పోటీలు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్**

మండలంలో రాగోలు, సింగుపురం జిల్లా పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి ఆర్.జయలక్ష్మి, బులుసు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యాన శనివారం విద్యార్థులు వంటలు చేశారు. బాగా వంటలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు శ్రీనివాసరావు, గణేష్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఆర్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వసతుల కల్పనకు కృషి : జెసి

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని జెసి చక్రధర్‌బాబు అన్నారు. శనివారం గాజులకొల్లివలసలోని వంశధార నిర్వాసితుల పునరావాస కాలనీలోని చంద్రన్న కానుకలు, నెల రేషన్‌తో పాటు అదనంగా 20 కిలోల బియ్యం రెండు వందల మంది కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తాము పూర్తిస్థాయిలో ఉపాధి కోల్పోయామని, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి కోసం రెండు పాడి ఆవులను ఒక్కో కుటుంబానికి ఇవ్వాలని జెసిని కోరారు. ఇళ్ల నిర్మాణాలకు నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉందన్నారు. ట్యాంకర్లతో


సరుకులు పంపిణీ చేస్తున్న జెసి చక్రధర్‌బాబు

నీటిని సరఫరా చేయాలని కోరారు. జెసి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తామన్నారు. త్వరితగతిన వాటర్ ట్యాంకు నిర్మిస్తామన్నారు. ఆయనతో పాటు సివిల్ సప్లయి డిఎం వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ దయానిధి, డిఎస్‌ఒ మోహన్‌బాబు, తహశీల్దార్ బాబ్జీరావు, ఆర్ఐ పుష్పలత, డిటి శ్రీనివాసరావు ఉన్నారు.


నర్సింగరావును సన్మానిస్తున్న ధర్మాన ప్రసాదరావు

## యువతకు నర్సింగరావు ఆదర్శం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

రాజకీయాల్లో ఉన్నత విలువలకు పట్టం కట్టిన మాజీ ఎమ్మెల్సీ గొండు నర్సింగరావు రాజకీయాల్లోకి వస్తున్న నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నర్సింగరావు 91వ జన్మదినం సందర్భంగా నగరంలోని గాజుల వీధిలోని ఆయన నావాసంలో నిర్వహించిన వేడుకలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్సీగా నర్సింగరావు అనేక పదవులను అలంకరించారన్నారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు కంటే ముందుగా రాజకీయాల్లోకి వచ్చారన్నారు. గొర్లె శ్రీరాములునాయుడును జిల్లా పరిషత్తు చైర్మన్‌గా ఎన్నుకోవడంలో నర్సింగరావు కీలక భూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.ఎల్.ప్రసాదరావు, వరం, ముంజేటి కృష్ణమూర్తి, చల్లా రవికుమార్, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రఘురాం, నాగరాజు పాల్గొన్నారు.

# సమస్యలుంటే తక్షణ పరిష్కారం

## 'జన్మభూమి' సభల్లో ఎమ్మెల్యే లక్ష్మీదేవి


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీదేవి

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరపాలక సంస్థ పరిధిలో తక్షణ పరిష్కారానికి వీలుగా సమస్యలపై దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి చెప్పారు. నగరంలోని చంపాగళ్ల వీధి, బొంపాడవీధి, గుడివీధి, బాదుర్లపేట, గూనపాలెం ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం వంటి పనులకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మరుగునీరును అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సభల్లో నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.వెంకటేశ్వరరావు, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టిడిపి నాయకులు చిట్టి నాగభూషణరావు, గుమ్మా నాగరాజు, ఎస్.వి.రమణ మాదిగ, టౌన్ ప్లానింగ్ అధికారి దేవకుమార్ పాల్గొన్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి సరుకులు పంపిణీ చేశారు. ఐటిడిఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

**బూర్జ** : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశీలకులు విక్రమ్‌పటిక్ అన్నారు. పెదలంకాం జన్మభూమిలో పాల్గొన్నారు. లాభాం, చీడివలసలో పలు సమస్యలు


బూర్జ : లాభాంలో ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, అందుకు దళారులను ఆశ్రయించి మోసపోతున్నామని రైతులు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ వద్ద మొరపెట్టుకున్నారు. మండలంలోని కొర్లకోట, కటేచార్యులపేట, తురకపేట, అక్కులపేట గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. అక్కులపేటలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. పోలీసులు కలుగజేసుకొని సర్ధుమణిగించి కార్యక్రమాన్ని సజావుగా సాగేలా చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ధాన్యం డబ్బులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పంచాది రాధ, తహశీల్దార్ బాబ్జీరావు, రాష్ట్ర కనీస వేతనాల సంఘం బోర్డు డైరెక్టర్ కోట గోవిందరావు, నీటి సంఘం అధ్యక్షులు సనపల ఢిల్లేశ్వరరావు, సనపల అప్పన్న, గృహ నిర్మాణశాఖ ఎఇ రంగారావు, ఎంపిడిఒ హబీబ్, మాజీ జెడ్‌పిటిసి బొడ్డేపల్లి మాధురి పాల్గొన్నారు.

పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ, ఎంపిపి బొడ్డేపల్లి సూర్యారావు, సర్పంచులు రామిచంద్రినాయుడు, బూరి లక్ష్మి, గోవిందరావు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రవీంద్రబాబు పాల్గొన్నారు.

### అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు

**శ్రీకాకుళం రూరల్** : మండలంలో డిటిపి ప్రభుత్వం సిసి రోడ్ల నిర్మాణాలు, కాలువలు తదితర సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి ఓర్వలేకే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపిపి గొండు జగన్నాథరావు, ఎంపిటిసి గొండు శంకరరావు, పాత్రునివలస సర్పంచ్ పి.అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కిష్టప్పపేట, పాత్రునివలస, అలికాం, సిలగాం, సింగువలస గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు వేరే వారి పేర్లతో నమోదు చేసుకుని అనుభవించారని, ఇప్పుడు తమ ప్రభుత్వం లబ్ధిదారుకు ఇవ్వడం చూసి ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలకు తాము బహిరంగ చర్చలకు రమ్మంటే ఒక్కరూ రావడం లేదన్నారు. అనంతరం చంద్రన్న బీమా ప్రొసెడింగ్స్, చంద్రన్న కానుకలు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించారు. చేసిన పశు, వైద్య శిబిరాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు స్వాతి, సర్పంచ్ రంథి రమణమ్మ, కంచు దశరథుడు, టిడిపి నాయకులు ఆర్.అప్పలస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.


కిష్టప్పపేటలో ప్రొసీడింగ్ ఆర్డర్‌ను అందిస్తున్న నాయకులు

### ధాన్యం దళారుల పాలవుతున్నాయి

**ఆమదాలవలస** : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మితే డబ్బులు బ్యాంకుల్లో వేస్తున్నారని, ఇటీవల నుంచి బ్యాంకు డబ్బులు


ఆమదాలవలస : మాట్లాడుతున్న విప్ రవికుమార్


మాట్లాడుతున్న రమేష్‌సాహు

## విద్యతోనే సమాజాభివృద్ధి

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

విద్యతో పాటు నైతిక విలువలు నేర్పితేనే విద్యార్థులు సమాజాభివృద్ధికి ఉపకారం చేసే వారుగా మారుతారని సత్యసాయి విద్యాసంస్థల జిల్లా యూత్ జాయింట్ కో-ఆర్డినేటర్ రమేష్‌సాహు అభిప్రాయడ్డారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన శనివారం సింధువాడలో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరంలో ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'యోగ విద్య-మానవత విలువలు' అనే అంశంపై చర్చించారు. అనంతరం గ్రామంలో బావుల్లో బ్లీచింగ్ చేసి వీధులను శుభ్రం చేసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు వెంకట శివానందమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పి.విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ కొన్ని రాజారావు, యూత్ సభ్యులు సతీష్, వెంకటేష్, శ్రీను రాజు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యదర్శి శ్రీదేవి, ఆశా కార్యకర్త శ్రీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణ మేనేజర్‌గా మల్లేశ్వరరావు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ**


మల్లేశ్వరరావు

విపత్తుల నిర్వహణ జిల్లా మేనేజర్‌గా వావిలపల్లి మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా ముఖ్య ప్రణాళికా విభాగంలో గణాంక విభాగంలో ఎడిగా విధులు నిర్వహిస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. కలెక్టరేట్‌లోని జి-సెక్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం బాధ్యతులు స్వీకరించారు. విపత్తుల నిర్వాహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేసిన తర్వాత మొదటిసారిగా జిల్లా మేనేజర్‌ను నియమించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
ఆదివారం
7-1-2018



# క్షమాపణల ముసుగు... కృతజ్ఞతల తొడుగు



రాజులు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నది పాతకాలం నాటి నానుడి. ప్రభుత్వాధినేతలు తలుచుకుంటే రెండు నాల్కల ధోరణితో వ్యవహరించగలరన్నది నేటి కాలం ధోరణి. వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను నిదానంగా పరిష్కరించాలని, పనులు మాత్రం వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సమీక్షా సమావేశాలు అందుకనుగుణంగానే జరిగాయి. నిర్వాసితుల పునరావాసం, పరిహారం, ప్యాకేజీల అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందిస్తామని చెప్పిన చంద్రబాబు, నిర్వాసితుల విషయంలో అలక్ష్యం చూపారు. చివరికి తన అసమర్థత పాలనను చాటిచెప్పారు. ప్రాజెక్టు పనుల్లో నిర్వాసితులే ప్రథమ లబ్ధిదారులు కావాలి. ప్రభుత్వం బండి ముందు గుర్రం వెనుక చందంగా వ్యవహరించింది. నిర్వాసితులను బాధల్లో ముంచి, పనులపై దృష్టిసారించడంతో వారిలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. మానవదండులా వేలాది మంది కదిలి రావడంతో ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వం వెనక్కి తగ్గక తప్పలేదు. పనులను అర్థాంతరంగా నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ నిర్వాకం వల్ల కాంట్రాక్టర్ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అప్పటికి గాని నిర్వాసితుల గోడు ముఖ్యమంత్రికి చేరలేదు. ఆయన ఏర్పాటు చేసుకున్న డ్యాష్‌బోర్డులు నివ్వెరపోయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని పాలనా సమర్థుడుగా ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి, అధికారుల వైఫల్యంగా చూపించారు. నిధులున్నా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో, అధికార యంత్రాంగం విఫలమైందని చంద్రబాబు ప్రకటించాల్సి వచ్చింది. మంచి జరిగితే అధినేత గొప్పతనం గానూ చెడు జరిగితే అది అధికారుల వైఫల్యం గానూ చూపడం చంద్రబాబుకు మొదట్నుంచీ అలవాటేనని ఆ పార్టీ నేతలే చెప్తుంటారు. అందువల్లే వైఫల్యాన్ని అధికార యంత్రాంగం ఖాతాలో వేసి ముఖ్యమంత్రి నిర్వాసితులకు క్షమాపణలు చెప్పారు.

ముఖ్యమంత్రి నోట తొలిసారి క్షమాపణల మాట రావడం పచ్చ పాలనలో మరో కోణం. 80 శాతం ప్రజలు సంతృప్తికరంగా లేరని తెలుసుకునే పచ్చ మెరుపుల కోసం క్షమాపణ చెప్పినట్లు కనిపిస్తోంది. అధికార యంత్రాంగం వేరు... ప్రభుత్వ యంత్రాంగం వేరు. ప్రభుత్వ యంత్రాంగంలో ముఖ్యమంత్రి, మంత్రులు భాగస్వామ్యమై ఉంటారు. సందర్భానుసారంగా ఆ రెండింటినీ వేరుచేసి చూపడం చంద్రబాబుకు అలవాటు. ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లా మంత్రి ఒత్తిడితోనే కలెక్టర్, ఎస్‌పిలు నిర్వాసితులపై ఏకంగా యుద్ధాన్నే ప్రకటించినంత పనిచేశారు. సెక్షన్-30, సెక్షన్-144ను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను హరించి వేశారు. దేశ సరిహద్దు గ్రామాల మాదిరిగా నిర్వాసితుల గ్రామాల్లో మఫ్టీలో ఉన్న పోలీసుల నిఘా పెంచారు. చివరికి ప్రజల కదలికలను గుర్తించేందుకు డ్రోన్లనూ ఉపయోగించారు. గ్రామాల్లో ప్రజలు మాట్లాడుకునేందుకు భయపడే పరిస్థితులు సృష్టించారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ హక్కులపై దాడి జరిగిందని హక్కుల సంఘాలే ఆరోపించాయి. న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి ఆదేశాల్లేకుండా జిల్లా అధికార యంత్రాంగం అంత సాహసానికి ఒడిగట్టే పరిస్థితి ఉండదు. ఆ నేపథ్యంలోనే హక్కుల కోసం నిలబడిన ఉద్యమ నేతలపై, న్యాయం కావాలని కోరిన నిర్వాసితులపై అక్రమ కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం నిర్వాసితుల జీవితాలతో ఆటలాడుకుంది. రాజ్య హింస సాగిందని మానవ హక్కుల సంఘాలు చెప్పాయి. చట్టాన్ని అమలు చేయకుండా నిర్వాసితుల ఇళ్లను కూల్చివేసి, నిలువ నీడ లేకుండా చేసి గ్రామాల నుంచి నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టడం చూశాం. ఆ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసినందుకు చంద్రబాబు ఇచ్ఛాపురం పర్యటనలో కలెక్టర్ ధనంజయరెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నిన్నటి వైఫల్యం నుంచి సాఫల్యంగా మారిపోయింది. నిర్వాసితులను వెళ్లగొట్టడంలో బాగా చేశారని, ఇక పనులు వేగవంతం వైపు చూడాలని ప్రత్యేకంగా చెప్తూ కలెక్టర్‌కు కృతజ్ఞతలు చెప్పారు. గందరగోళం, గొడవలు జరిగినా సామరస్యంగా పరిష్కరించారని కలెక్టర్‌కు చంద్రబాబు కితాబునిచ్చారు. నిర్వాసితుల గొంతు నొక్కి వెళ్లగొట్టడం ముఖ్యమంత్రి నిఘంటువులో సామరస్యంగా ఉన్నట్లుంది. మంత్రి అచ్చెన్నాయుడు అందించిన సమాచారంతోనే ముఖ్యమంత్రి అలా స్పందించినట్లు ఉంది. అందువల్లే ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ముందే నిర్వాసితులను ఘనంగా పంపినందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను మంత్రి సన్మానించడం చూశాం. నిర్వాసితుల పునరావాస కాలనీల్లో అలాంటి సాహసం చేయడానికి సిద్ధపడలేదు. శ్రీకాకుళం రూరల్ మండలం భైరిలో ముందస్తు వ్యూహం ప్రకారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు, అధికార యంత్రాంగం నివ్వెరపోయిన పరిస్థితి ఎదురైంది. ఆ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై పలుమార్లు సమావేశాలు నిర్వహించామని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యేందుకు ప్యాకేజీల చెల్లింపుల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇరువురూ చాకచక్యంగా వ్యవహరించారని ప్రశంసించారు. గతంలో ఉన్న వారు ఆ పనిచేయలేకపోయారని చెప్పి ఓ రాయి విసిరేశారు. వీరిద్దరూ నిర్వాసితుల గ్రామాల్లో దగ్గరుండి ఇళ్లను కూల్చివేయించారని, దీంతో పనులు ముందుకు సాగడానికి దోహదపడిందని చెప్పుకొచ్చారు. అందుకు జన్మభూమి సభలో మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఇరువురు అదే అధికార యంత్రాంగంపై, అదే సమస్యపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడం చూశాం. అందువల్ల వారి క్షమాపణలు ప్రజల ముందు ఒక ముసుగు వంటిది. వారు చెప్పే కృతజ్ఞతలు ఒక తొడుగు వంటివి. ముసుగు తాత్కాలికం... తొడుగు శాశ్వతమన్నది వేరే చెప్పనవసరం లేదు. ఈ సన్మానం కలెక్టర్, జెసిలకు పరిమితం చేసి ఎస్‌పిని విడిచిపెట్టడం చర్చనీయాంశమైంది. ఎస్‌పి పాత్ర లేకుండా మంత్రి చెప్పినట్లు కలెక్టర్, జెసి చాకచక్యంగా వ్యవహరించలేరు. ఎస్‌పికి కృతజ్ఞతలు చెప్పాలన్న ఆలోచన మంత్రికి రాకపోవడం విచిత్రం. అది పోలీసుల విధినిర్వహణలో భాగమేనని చెప్పుకోవడానికి వీల్లేదు. అలా అయితే కలెక్టర్, జెసినీ విధినిర్వహణలో భాగంగానే చూడాల్సి ఉంటుంది. అలాంటప్పుడు కృతజ్ఞతలతో సరిపుచ్చక సన్మానాలు చేయడమెందుకు?. ప్రభుత్వ నిర్ణయాన్ని నిర్దాక్షిణ్యంగా అమలు చేసినందుకు అభినందనలు చెప్పడం సాధారణమైనా, సన్మానాలు చేయడం అసాధారణం. ఈ సంప్రదాయం మంచిది కాదని అధికారవర్గాల్లోనే చర్చ మొదలైంది. ఇందులో ప్రతిష్ట ఒకరికి అప్పగించాలని ప్రయత్నిస్తే, మరొకరికి అప్రతిష్ట మిగులుతుందన్న అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. అసలు ఈ సన్మానాల సందడి ఎందుకొచ్చింది?. అందుకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమం వేదికను చేసుకోవడమేమిటి?. ఆ వేదిక ప్రచారానికి బాగా ఉపయోగపడుతుందని భావించినట్లు కనిపిస్తోంది. అధికారులకు సన్మానం చేయడం ద్వారా నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరిగినా, అందుకు వీరే బాధ్యులని ప్రభుత్వం చెప్పినట్లయింది. స్వచ్ఛత ప్రభుత్వానికి, మలినం అధికారులకు అంటగట్టే ప్రయత్నం జరిగిందని అధికారవర్గాలు భావించినట్లు తెలిసింది. వంశధార నిర్వాసితుల బాధలను ప్రత్యక్షంగా చూసిన అధికార యంత్రాంగం మానవీయతను ప్రదర్శించారు. సిబ్బందితో కలిసి లక్షల రూపాయలు పోగేసి వేల సంఖ్యలో దుప్పట్లను పంపిణీ చేశారు. అధికారులు, ఉద్యోగులు ఇలా చేయడంతో ప్రభుత్వానికి మరికొంత అప్రతిష్ట మిగిల్చినట్లయింది. నేతలు తేలు కుట్టిన దొంగల్లా మిన్నకుండాల్సి వచ్చింది. క్షమాపణలు నిర్వాసితులకు చెప్పి, అధికారులకు కృతజ్ఞతలతో సన్మానాలు చేయడం ముసుగు ఎవరికి పడిందో బహిర్గతమైంది.

– సత్తారు.భాస్కరరావు

## చలికాలంలో వెచ్చదనానికి...

- కాలానుగుణంగా పదార్థాలతో ప్రయోజనం
- చలిని తట్టుకోవడానికి మంచి మార్గం

# ఆరోగ్యం

# చక్కనైన ఆహారం





*ప్రకృతిలో ఆహారానికి ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఆహారాన్ని మితంగా, రుతువులకు అనుగుణంగా సక్రమంగా తీసుకుంటే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పలు పరిశోధనలు తేల్చాయి. ఆహార రహస్యాలు తెలుసుకుని కాలానుగుణంగా వాటిని తీసుకుంటే అందమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుత చలికాలంలో శరీరానికి వెచ్చదనాన్ని ప్రసాదిస్తూ ఆరోగ్యవంతంగా ఉండటానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు మీ కోసం...*

ప్రజాశక్తి-హిరమండలం

రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రతతో ప్రజలు గజగజలాడుతున్నారు. చలిపులి బారి నుంచి తప్పించుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కో విధానాన్ని ఆచరిస్తారు. ఒక్కో మార్గాన్ని అనుసరిస్తారు. ఇందులో ఆహార పదార్థాలూ కీలకమేనని పలువురు పేర్కొంటున్నారు. నిర్దేశిత ఆహారాన్ని తీసుకుంటే చలికాలంలో వెచ్చదనాన్ని పొందడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

### దుంపకూరలు

చలికాలంలో సాధారణంగా లభించే దుంపకూరలు మంచివి. కంద, చామ, క్యారెట్, బీట్‌రూట్, చిలగడ దుంప, అల్లం ఎక్కువగా తీసుకుంటే శారీరక ఉష్ణోగ్రతను సాధారణం చేస్తాయి. దుంపలు భూమి లోపల పెరుగుతుంటాయి. ఇవి శరీరానికి వేడిని కలిగించే గుణంతోపాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ దుంపలను ఉడికించిన తరువాత ఆహారంగా తీసుకోవాలి. లేకుంటే వాతం(గ్యాస్టిక్) సమస్య పెరిగి అజీర్ణానికి దారి తీస్తుంది.

### పండ్లు

ద్రాక్ష, కమల, సపోట, పైనాపిల్, రేగు, అరటి, బొప్పాయి, తదితర సంప్రదాయ పండ్లు శీతాకాలంలోనే మనకు లభిస్తాయి. వీటిని తప్పకుండా తీసుకోవాలి. చలికాలంలో ఈ పండ్లు వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి.

### పాలపదార్థాలు

పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, మజ్జిగ, పన్నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఈ పదార్థాలను ఆహారంగా తీసుకుంటే శరీరంలోని కొవ్వు శాతాన్ని సమస్థితిలో ఉంచి శరీరం నుంచి వేడిని కోల్పోకుండా కాపాడుతాయి.

### సుగంధ ద్రవ్యాలు

ఇంగువా, మిరియాలు, యాలకలు, దాల్చినచెక్క, జీలకర్ర, సొంపు, మెంతులు, ఆవాలు, పసుపు, తదితర సుగంధ ద్రవ్యాలు ఆహారంలో తీసుకోవడం మంచిది. ఇవి జీర్ణశక్తి, రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.

### డ్రైఫ్రూట్స్



బాదం, పిస్తా, జీడిపప్పు, ఖర్జూరం, పొద్దుతిరుగుడు విత్తనాలు, బఠానీలు వంటి ప్రోటీన్లతో కూడిన డ్రైఫ్రూట్స్‌ను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి శరీరంలో ఉష్ణశక్తిని అధికంగా పెంపొందిస్తాయి.

### ఆకుకూరలు

మెంతి, పాలకూర, కొత్తిమీర, తోటకూర, ముల్లంగి ఆకులు వంటి కూరలను ఎక్కువగా తీసుకోవడం వల్ల విటమిన్-సి ఎక్కువగా లభిస్తుంది. ఇవి రోగనిరోధక శక్తిని ఎక్కువగా పెంచుతాయి. చలికాలంలో వచ్చే వ్యాధులను ఇవి దూరం చేస్తాయి.

### పానీయాలు

బ్లాక్‌టీ, అల్లం టీ, యాలకులు కలిపిన టీ, దాల్చినచెక్క కలిపిన టీ, లవంగాలు కలిపిన టీ, కాఫీ, గోరువెచ్చని నీరు ఎక్కువగా సేవించాలి. వీటి ద్వారా చలి నుంచి ఉపశమనం పొందవచ్చు.

### ఇతర ఆహారపదార్థాలు

ఇవే కాక నువ్వులు, లవంగాలు, పంచదార, బెల్లం, సగ్గుబియ్యంతో చేసిన పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. చలికాలంలో ఇవి ఎక్కువగా తీసుకుంటే శరీరంలో ఉష్ణోగ్రతలను పెంపొందిస్తాయి.

### ఇవి శ్రేయస్కరం

దుంపలు, పండ్లు, ఆకుకూరలు, పాలపదార్థాలు, సుగంధ ద్రవ్యాలు, పానీయాలు, డ్రైఫ్రూట్స్, మాంసకృత్తులున్న ఆహార పదార్థాలు చలికాలంలో తీసుకోవడం శ్రేయస్కరం. మాంసాహారం విషయానికొస్తే చికెన్, మటన్, చేపలు, రొయ్యిలు శరీరంలో ఉష్ణోగ్రతలను సమతుల్యం చేస్తాయి. వీటి వల్ల శరీరానికి తగినంత వేడి సమకూరుతుంది. చికెన్ విషయంలో నాటుకోడి మాంసం తినడం మంచిది. వేయించిన, కాల్చిన మాంసాహారాన్ని భుజించొద్దు.

### కాలానుగుణంగా ఆహారం

కాలానికి అనుగుణంగా లభించే ఆహార పదార్థాలను తప్పకుండా తీసు కోవాలి. చలికాలంలో తినే ఆహారంలో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. శరీరానికి కావాల్సిన కాల్షియం, పాస్పరస్, పొటాషియం, తదితర అన్ని రకాల విటమిన్లు అందుతాయి. సంప్రదాయ ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు తటస్థంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుంది.

– మెండ రజేష్
వైద్యాధికారి, హిరమండలం



# బిల్లుల మోత

- రోగులకు తప్పని మందుల పోటు
- పట్టించుకోని సర్కారు
- జిఎస్‌టితో రోగులపై అధిక భారం

**'వైద్యో నారాయణో హరి' అని అన్నారు పెద్దలు. ఇప్పుడు దాని అర్థం మారిపోయింది. వైద్యో వ్యాపారో హరిగా చేసేశారు. మెడికల్ టెస్టులు, చెకప్‌లు, మందుల బిల్లుల మోతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడైనా వైద్యులు రాసిన మందులను రోగి కొనడం పరిపాటి. కొన్ని ప్రయివేటు కంపెనీలు తమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగించుకునేందుకు కొత్త దారులు తొక్కుతున్నాయి. తమ కంపెనీ మందులను అధికంగా సేల్ చేసే వైద్యులకు కమీషన్లు, గిఫ్టులు, విదేశీ పర్యటనలకు విమాన టిక్కెట్లను ఆశగా చూపుతున్నాయి. దీంతో కొందరు వైద్యులు రాసే మందులు ఆ ఆస్పత్రి మందుల షాపు వద్దే దొరికే పరిస్థితి ఉంది. ఇంకెక్కడా దొరకవు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎవరికి వారు అడ్డదారులు తొక్కడంతో వినియోగదారులైన ప్రజలు, రోగులు మోసపోతున్నారు.**





ప్రజాశక్తి - మందస

మనిషి అన్నాక జబ్బులు, జ్వరాలు సాధారణం. మనిషికి జబ్బు రాకున్నంత సేపు బాగానే ఉంటాడు. పొరపాటున వస్తే అప్పుడు తెలుస్తుంది అసలు కథ. జబ్బుచేసి వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే.. అందులోనూ ఏ ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్తే జబ్బుతో మన ఒళ్లు.. వారిచ్చిన బిల్లుతో ఇళ్లుగుళ్ల అయ్యే రోజులు వచ్చేశాయి. వైద్యానికి అయ్యే ఖర్చును చూసి కంగుతినాల్సిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయి. రోగికి అధిక ధరల మందు పోటు తప్పడం లేదు. మందుల ముసుగులో కొన్ని బినామి కంపెనీలు తయారు చేసే మందులను ఆస్పత్రులు, మందుల షాపు యాజమానులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి రోగులకు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

### ఎంతరేటు చెబితే అంతే..

మందులు బేరమాడి కొనే వస్తువు కాదు. కాబట్టి రోగులు ఔషధ దుకాణదారులు ఎంత బిల్లు వేస్తే అంత మొత్తాన్ని చెల్లించి వస్తుంటారు. రోగుల అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని పలాస, హరిపురం, మందస, వజ్రపుకొత్తూరు, పూండి ప్రయివేట్ ఆస్పత్రుల్లో రోగులకు అధిక ధరల పోటు తప్పడం లేదు.

### జిఎస్‌టితో మరింత భారం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఎస్‌టితో మందులపై 12 శాతం అధికంగా పన్ను పడింది. దీంతో వినియోగదారులపై అదనంగా మరింత భారం పడుతోంది. నియోజకవర్గంలోని ప్రతి రోజూ కొన్ని వందల మంది ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైద్యం చేసుకున్న తరువాత డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం వారి సొంత ఆస్పత్రుల్లోనో, ప్రతిపాదించిన మందుల దుకాణాల్లోనో కొనుగోలు చేయక తప్పదు. జనరిక్ మందులపై మందుల షాపు యాజమానులకు తక్కువ లాభం వస్తోంది. కనుక అధిక లాభం పొందటానికి వారి దగ్గర దొరికే వేరే కంపెనీల మందులను వైద్యులు రిఫర్ చేస్తే ఇరువురికీ లాభం ఉంటుంది. అందుకని అలాంటి మందులను వైద్యులు రాసి ఇస్తున్నారని పలువురు రోగులు అంటున్నారు. వైద్య పరిక్షలు చేసుకునే చోటా ఇదే రకమైన దోపిడీ జరుగుతుందని రోగులు అంటున్నారు.

### అనుమతి ఒకరు.. నిర్వహణ మరొకరు

నియోజకవర్గంలో ఔషధ నియంత్రణశాఖ గుర్తింపు పొందిన మెడికల్ షాపులు 87 ఉన్నాయి. వాటిలో 80 శాతం మంది ఫార్మా షిస్టుల నుంచి ధ్రువపత్రాలను నెలకు రూ.2500 నుంచి రూ.మూడు వేలు వరకు చెల్లించి అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. ఈ విషయం తెలిసినా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మామ్మూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడంలేదు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దుకాణదారులు ఫార్మాషిస్టుకు చెల్లించాల్సిన అద్దె సొమ్మును, మామ్మూళ్లు నిమిత్తం చెల్లించే సొమ్ము భారం అంతా వినియోగదారులపై మోపుతున్నారని పలువురు అంటున్నారు.

### కొరవడుతున్న నిఘా

ఔషధ నియంత్రణ శాఖాధికారులు నెలవారి కనీసం జిల్లా మొత్తం మీద కనీసం 50 దుకాణాలైనా తనిఖీ చేయాల్సి ఉండగా ఆ విధంగా ఎక్కడ జరగడం లేదు. వైద్యులు మందుల పేర్లు రాసేటప్పుడు విడి విడి అక్షరాలతో అందరికీ అర్థమయ్యేలా రాయాల్సి ఉన్నప్పటికీ వైద్యులు దాన్ని అనుసరించడం లేదు. ఆస్పత్రుల్లోని మందుల దుకాణాలపై తనిఖీ చేస్తున్న దాఖలాలు కూడా లేవు. దీంతో కొన్ని దుకాణాల్లో నిషేధిత మందులను కూడా అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దాడులు నిరంతరం కొనసాగిస్తే కొన్ని అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. వైద్యులు సొంతంగా, బినామీ పేర్లతో మందులు దుకాణాలు నడపరాదని, ఎలాంటి కమీషన్లు, రాయితీలను తీసుకోకూడదని నిబంధనలు చెబుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇకనైనా వినియోగదారులపై అధిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### జిఎస్‌టితో మరింత భారం



మందులకు జిఎస్‌టి పన్ను పోటుతో వినియోగ దారులపై మరింత భారం పడింది. ఇంతకు ముందు రూ.10కి కొన్న టాబ్లెట్ ఇప్పుడు రూ.13కు కొనాల్సివస్తోంది. జిఎస్‌టిని మందులకు మినహాయిస్తే పేదలకు మేలు చేకూరే అవకాశం ఉంది.

–కర్రి గోపాలకృష్ణ,
సర్పంచ్, వి.జి.పురం

### జనరిక్ మందులు అందుబాటులోకి తేవాలి



గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందులను అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతగానో మేలుకలుగుతుంది. పట్టణ ప్రాంతాలకే జనరిక్ మందులను పరిమితం చేయడం ఎంత వరకు సమంజసమో ప్రభుత్వమే ఆలోచించుకోవాలి.

దుమ్ము కామరాజు
దుమ్మువాళ్లూరు

# సైకిళ్లకు రక్షణ ఏది..?

- షెడ్‌ల కొరత
- చోరీకి గురవుతున్న సైకిళ్లు





ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల సైకిళ్లకు రక్షణ కరువవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి చదువుల కోసం పాఠశాలకి సైకిళ్లపై వచ్చే విద్యార్థులకు పాఠశాల ఆవరణలో సైకిళ్ల పెట్టుకునేందుకు అవసరమైన షెడ్‌లు లేకపోవడంతో సైకిళ్లకు రక్షణ లేకుండా పోతోంది. దీంతో విద్యార్థులు సైకిళ్ల మరమ్మతులకు గురికావడంతో వారు పలు అవస్థలకు గురవుతున్నారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఏ ఒక్క పాఠశాలకీ సైకిల్ షెడ్‌లు లేకపోవడం విశేషం. దీంతో విద్యార్థులకు చెందిన సైకిళ్లు ఎండకి ఎండి, వానకి తడిసి పోవడంతో అవి మరామ్మతులకు గురవుతున్నాయి. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన సైకిళ్లకు రక్షణ లేక, మరమ్మతులకు గురవుతుండడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అనేక పాఠశాలల్లో సైకిళ్లు బయటనే ఉండిపోవడం వల్ల రక్షణ కరువవుతోంది. కొన్ని పాఠశాలల విద్యార్థులకు చెందిన సైకిళ్లు దొంగతనానికి గురవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేయలేని సందిగ్ధ పరిస్థితుల్లోకి ఉపాధ్యాయులు నెట్టబడుతున్నాయి. ప్రతి పాఠశాలకూ సుమారు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. వారిలో కొందరు బస్‌లకు రాగా, మరికొందరు ఆటోలకు వస్తుంటారు. ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థినుల్లో తొమ్మిదో తరగతి చదివిన వారికి సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలల ప్రహరీ, మైదానాల అభివృద్ధికి నిధులు విడుదల చేసినట్లు సైకిల్ షెడ్‌లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

### ఇబ్బందులు పడుతున్నాం

పాఠశాల్లో సైకిల్ షెడ్‌లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామం నుంచి పాఠశాలకి రావాలంటే సుమారు ఐదు కిలో మీటర్లు రావాల్సి ఉంటుంది. అటువంటి సమయంలో పాఠశాలకి రావాలంటే సైకిల్లే మాకు ఆధారం. పాఠశాల ఆవరణలో సైకిల్ షెడ్‌లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎండకు గాలి వదిలేయడం, ప్యాచీ కావడంతో డబ్బులు లేక, ఇంటికి ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు.

–కడియాల భవాని, నర్సింగపల్లి

# గ్రామాలన్నీ ప్రగతిపథం వైపు


సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిరమండలం

వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని సోలిపి గ్రామ నిర్వాసితులతో గొట్టిపల్లి కొండ సమీపాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాపు మాట్లాడుతూ సోలిపి గిరిజన నిర్వాసితులకు పునరావాసం పూర్తి చేయకుండా ఇళ్లను కూలగొట్టి బలవంతంగా నెట్టేశారన్నారు. దీంతో వారు చేసేదేమీ లేక ఎగువ భాగాన చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఎముకలు కొరికే చలిలో వృద్ధులు, పిల్లలు,గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామానికి చెందిన రెండు ఇళ్లకు పరిహారం అందించకుండా అధికారులు కూలదోశారన్నారు. నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇళ్లను కూలగొట్టి నిర్వాసితులకు బయటకు బలవంతంగా నెట్టేశారనీ, ఇది దారుణమని ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు నిర్వాసితులు ఏర్పాటు చేసుకున్న పునరావాస కాలనీకు రహదారులు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆకట్టుకున్న గణిత ప్రదర్శన

**పాలకొండ:** జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పాలకొండ పట్టణంలో పెదకాపు వీధి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గణితం బోధన పద్ధతులపై శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వార్డు కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. స్థాన విలువలు, రోమన్ అంకెలు, ద్రవ్యమాసం, ద్రవ, ఘన పదార్థాలు, కొలతలు వంటి ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందరావు, సంపత్‌కుమార్, కెఎన్‌వి ప్రసాద్ తదితరులున్నారు.


పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

## విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-కొత్తూరు

స్థానిక వెంకటేశ్వర కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని మెట్టూరు ఉన్నత పాఠశాలలో గులివిందలపేట ప్రాథమికోన్నత పాఠశాలలో వీధుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రం చేశారు. చెత్తను ఊడ్చి దూరంగా పారబోశారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయరాదని మహిళలకు సూచించారు.

ఇలా చేయడంవలన గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని గ్రామస్తులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గేదెల కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు చిరంజీవి, సాయిరాం పాల్గొన్నారు.

### రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి,హిరమండలం/ఎల్ఎన్‌పేట

రాష్ట్రంలో గ్రామాలన్నీ ప్రగతి పథంవైపు నడిపించేందుకు నడిపించేందుకు సిఎం చంద్రబాబునాయుడు చేసిన కృషి దేశానికే ఆదర్శమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని రావిచంద్రి గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి, ఎంపీ పాల్గొని మాట్లాడారు. విభజనతో రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందుల్లో పడిందనీ అయినా ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కంకణం కట్టుకుందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వంశధార జలాశయాన్ని మార్చి నాటికి పూర్తి చేసి జిల్లాలో తాగు,సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.వంశధార జలాశయంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి పరిహారం అందజేశామనీ, జలాశయం నిర్మాణానికి పూర్తి సహకారం అందజేసిన నిర్వాసితుల త్యాగాలు మరువలేనవన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకున్నామన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నదీ జలాలు అనుసంధానంలో భాగంగా వంశధార,నాగవళి నదులు అనుసంధానం చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది జూలై నాటికి నదుల అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలబెడతామన్నారు. దీంతో పాటు జిల్లాలో వంశధార,నాగవళి నదులకు కరకట్టల నిర్మాణానికి రూ.1020 కోట్లను నిధులు వెచ్చించి పూర్తి చేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేయని పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు.


సరుకులను అందజేస్తున్న మంత్రి, ఎంపీ, గౌతు శిరీష

వంశధార నిర్వాసితుల త్యాగాలు మరువలేవనీ, వారికి పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ధనుంజయరెడ్డి,పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ఎంపిపి కృష్ణవేణి, జెడ్‌పిటిసి సభ్యులు వి.సుగుణ,ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

### జెసి చక్రధరబాబు

ప్రజాశక్తి-కొత్తూరు

వంశధార నిర్వాసితులకు పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని జెసి చక్రధరబాబు తెలిపారు. శనివారం మండలంలోని కర్లెమ్మ కాలనీలో పాడలి, గదబపేట నిర్వాసితుల కాలనీని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇళ్లకు విద్యుత్ మీటర్లును ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరారు. కొత్తగా మీటర్లను ఏర్పాటు చేయడానికి అధికారులు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు జెసి వద్ద నిర్వాసితులు వాపోయారు. డబ్బులు చెల్లించకుండా విద్యుత్ మీటరు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని జెసి అన్నారు. అలాగే కొంత మంది ప్యాకేజీలు అందలేదని జెసి దృష్టికి తీసుకువెళ్లగా అటువంటివి ఉంటే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.


జెసికి సమస్యలు తెలుపుతున్న నిర్వాసితులు

ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సౌజన్యంతో వంశధార నిర్వాసితులకు ఒక్కొక్క కుటుంబానికి 20 కేజీలు చొప్పున సన్న బియ్యం, అలాగే చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. అయితే సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ముందుగా నిర్వాసితులకు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. జన్మభూమి ద్వారా రేషన్‌కార్డులు, పింఛన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జెసి విలేకరులతో మాట్లాడుతూ హిరమండలం, కొత్తూరు మండలంలోని నిర్వాసితులకు పంచాయతీలు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈయనతో పాటు ఆర్‌డిఒ దయానిధి, రెవెన్యూ సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.రామారావు, మోహన్‌బాబు, తహశీల్దార్ ఎం.సావిత్రి, జిల్లా డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, సిఎస్‌డిటి బుచ్చియ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఒక్క రూపాయి కూడా అందలేదు

### చిదిమి జన్మభూమిలో గ్రామస్తుల నిలదీత

ప్రజాశక్తి-వీరఘట్టం

సంక్షేమ పథకాల్లో భాగంగా ఒక్కో కుటుంబానికి పది వేలు ఆర్థిక సాయం చేస్తామని సిఎం చంద్రబాబు గతంలో ప్రకటించారనీ, కనీసం ఒక్క రూపాయి కూడా అందలేదని మండలంలోని యు.వెంకంపేట గ్రామస్తులు జన్మభూమిలో అధికారులను నిలదీశారు. మండలంలోని యు వెంకంపేట గ్రామానికి చెందిన పొట్నూరు త్రినాథరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా చంద్రన్న బీమా పథకం ద్వారా ఒక్క రూపాయి కూడా అందించలేదని ఆయన భార్య లక్ష్మీ అధికారులను నిలదీసింది. అలాగే గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించినందుకు ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని అదే గ్రామానికి చెందిన బి.హైమావతి మొరపెట్టుకుంది. రుణమాఫీ కింద కొంత మందికే రుణాలు మాఫీ అయ్యాయని పలువురు రైతులు ధ్వజమెత్తారు. పసుపు, కుంకుమ కింద రూ.10వేలు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిందనీ, అయితే రుణాలను పూర్తి స్థాయిలో ఎందుకు చెల్లించలేదని పలువురు మహిళలు ప్రశ్నించారు. అలాగే సిఎస్‌పి రహదారి నుంచి చిదిమి గ్రామం వరకు బిటి రహదారి అధ్వాన్నంగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులతో పాటు తాము కూడా


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామనీ, అక్కడక్కడ ఏర్పడ్డ గుంతలను స్వంత డబ్బులు వెచ్చించి గ్రావెల్ వేసుకున్నామన్నారు. గ్రామంలో ఆరు విద్యుత్ స్తంభాలు వేరేచోటకు మార్చాలనీ, అలాగే డిపిని కూడా వేరేచోటకు మార్చాలన్నారు. పివిఆర్‌పురం, రేగులపాడు, హుస్సేనుపురం గ్రామంలో జన్మభూమి సాదాగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వాన రమణమ్మ, నీలం భాస్కరరావు, గేదెల హైమావతి, లక్ష్మీనారాయణమ్మ, ఎంపిటిసిలు సొంట్యాన లక్ష్మి, పొన్నాడ శ్రావణి, తహశీల్దార్ ఎం.వి.రమణ, ఎంపిడిఒ ఎం.చంటిబాబు, మండల ప్రత్యేకాధికారి వై.వి.శ్యామ్‌కుమార్, తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ నిమ్మక పాండురంగ, జన్మభూమి కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, ఖండాపు వెంకటరమణ పాల్గొన్నారు.

## పాఠశాల సెలవు రద్దు

ప్రజాశక్తి-హిరమండలం

మండలంలోని జన్మభూమి నిర్వహిస్తున్న పంచాయతీల్లో పాఠశాలలు విధిగా పని చేయాలని ఎంఇఒ కె.రాంబాబు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వంశధార నిర్వాసితులకు సుభలాయ్ కమ్యూనిటీ భవనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు సంబంధిత పాఠశాల విధిగా తెరవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిని సంబందిత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది గమనించాలని తెలపారు.

## సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, సర్పంచులు కృషి చేయాలని పాలకొండ నియోజకవర్గం పరిశీలకులు జివివిఎస్ఎస్. ప్రసాదరావు ఆదేశించారు. శనివారం రేగులపాడు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ప్రసాదరావు హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని సిసి రహదారులు, మరుగుదొడ్లు వంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈయనతో పాటు తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ నిమ్మక పాండురంగ, మండల ప్రత్యేకాధికారి వై.వి.శ్యామ్‌కుమార్, ఎంపిడిఒ ఎం.చంటిబాబు, సర్పంచ్ హైమావతి, మండల జన్మభూమి కమిటీ సభ్యులు ఖండాపు వెంకటరమణ, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఎంపిటిసి శ్రావణి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్నాడ నాగేశ్వరరావుతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## జన్మభూమి ఎందుకు?

**హిరమండలం:** ప్రజా సమస్యలు పరిష్కరించని జన్మభూములెందుకు అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. శనివారం మండలంలోని తుంగతంపర, అక్కరాపల్లి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పలు వినతులు స్వీకరించారు. గత జన్మభూమిలో వినతులకు నేటి వరకు పరిష్కరించలేదని ఆయా గ్రామస్తులు పేర్కొన్నారు. ఇచ్చిన వినతుల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు,ఇంకుడు గుంతలు, పింఛన్లు మంజూరు చేయలేదంటూ వినతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.రామస్వామి, తహశీల్దార్ ఎం.కాళిప్రసాద్, సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# మొక్కల పెంపకం ప్రతిఒక్కరి బాధ్యత


మాట్లాడుతున్న మల్లిఖార్జునరావు

## అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ మల్లిఖార్జునరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మొక్కలను పెంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ పి.మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని ధర్మవరంలో శనివారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం భూమిలో 30 శాతంగా ఉండాల్సిన, చెట్లు 11 శాతమే ఉన్నాయని, ఇది ప్రమాదకర పరిణామమని పేర్కొన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. విద్యార్థులు, యువత, మహిళలు, కుటుంబ యజమానులు ఇలా ప్రతిఒక్కరూ ఒక్కో మొక్కను పెంచాలని పిలుపునిచ్చారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు.

ఈ సందర్భంగా ధర్మవరం, రామజోగిపేట, రుప్పపేటలోని సమస్యల పరిష్కారం కోసం వైసిపి నాయకులు అల్లు సూర్యనారాయణ వినతిపత్రం అందించారు. తొలుత గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి బల్లాడ వెంకటరమణారెడ్డి, ఎంపిడిఒ పొన్నాడ మోహన్‌కుమార్, సర్పంచ ఎండ నాగరాజు, టిడిపి నాయకులు బాణ్ణ రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

## స్వయంశక్తి సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- సంతకవిటి

గ్రామాల్లోని మహిళలందరూ మహిళా స్వయంశక్తి సంఘాల్లో చేరి గ్రామైఖ్య సంఘాలను మరింత బలోపేతం చేయాలని రాజాం క్లస్టర్ బిఎంజి ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనిధి భవనంలో మహిళా స్వయంశక్తి సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా పొదుపులు కట్టించాలన్నారు. బ్యాంకు లింకేజీలపై తెలుసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. వడ్డీలేని రుణాలు వాడుకుని, రికార్డులు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సంఘాల్లోని సభ్యులందరికీ చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ వసంత, మండల మహిళా కార్యదర్శి సూర్యకాంతం, సిఆర్‌పి రమణమ్మ పాల్గొన్నారు.

## చంద్రబాబు తీరు గర్హనీయం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మత్స్యకారులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవర్తించిన దురుసుతనం గర్హణీయమని జిల్లా మత్స్యకార సంఘాల ఐక్యవేదిక నాయకులు మూగి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరినందుకు తోలుతీస్తా...నంటూ అప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడటం ముఖ్యమంత్రి స్థానంలో వ్యక్తికి తగదన్నారు. ఇలాంటి వైఖరి మార్చుకోకుంటే మత్స్యకారులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## 'వెంకటేశ్వర'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చెన్నయ్‌కు చెందిన థింక్ సింక్ అనే బిపిఒ సంస్థ ఈ ఇంటర్వ్యూలు చేపట్టింది. ఇందులో 240 మంది విద్యార్థులు హాజరు కాగా, 72 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది మే, జూన్ నెలలో ఎంపిక విద్యార్థులు విధుల్లో చేరాలని బిపిఒ సంస్థ ప్రతినిధులు ఆర్.రహమాన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్య సభ్యులు ఐ.కిషోర్, బి.ఎస్.రాజా, ప్రిన్సిపల్ ఎం.గోవిందరాజులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులు యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపల్

# ఆత్మీయ సమ్మేళనం అదుర్స్

## కలుసుకున్న 1985-86 పదోతరగతి విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

ప్రజాశక్తి- రాజాం

రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం స్థానిక తృప్తి రీసార్ట్స్‌లో ఆత్మీయంగా కలుసుకున్న సమ్మేళనం ఆదరగొట్టింది. ఆంధ్రా, తెలంగాణాలో ఉద్యోగాలు చేస్తున్న వారితో పటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉద్యోగులు సైతం ఈ గెట్ టుగెదర్‌కు హాజరయ్యారు. ఇందులో అప్పటి గురువులు ఆకిరి రామారావు, కె.పెంటయ్య, జి.మోహనరావు, జి.రామచంద్రినాయుడు, ఒ.జె.ఎస్‌జరత్నం, బి.విశ్వనాథం తో పాటు మేడమ్ బేగంకు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఒకరికొకరు కరచాలనంతో పాటు ఆలింగనాలు చేసుకొని మరోమారు తమ స్థితిగతులను తెలియజేసుకున్నారు. అవసరమైతే తోటి స్నేహితుల్లో పేదవారికి ఆర్థికంగా చేయూతనిద్దామని, పేదవారికి సహాయ సహకారాలు అందిద్దామని చెప్పుకున్నారు. ఇందుకు సభ్యుల్లో ఒక టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఏటా ఇలాగే కలుసుకుందామని ప్రకటించుకున్నారు. కార్యక్రమంలో గ్రంధి రామ్‌సాయి, కె.గిరిరాజు, పి.పాపారావు, శాసపు వెంకటరమణ, శ్రీధర్, బాలసుబ్రమణ్యం, రాజశేఖర్, మున్ని, పద్మ, పార్వతి, రేవతి, 40 మంది అభ్యర్థులు కలుసుకున్నారు.


ఆన్‌లైన్ ద్వారా ఎల్ఎల్ఆర్ టెస్టును పరిశీలిస్తున్న అధికారులు

## 'శివానీ'లో ఎల్ఎల్ఆర్ మేళా

ఎచ్చెర్ల: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో లెర్నింగ్ లైసెన్స్ రిక్వెస్టు (ఎల్ఎల్ఆర్) మేళాను శనివారం నిర్వహించారు. మొత్తం 194 మంది విద్యార్థులకు ఎల్ఎల్ఆర్‌లు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రవాణా నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్ర మంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రామ్‌కుమార్, వెంక టరావు, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పార్వతి, కళాశాల యాజమాన్య సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, దుప్పల వెంకటరావు, సాయినాథ్‌రెడ్డి, సూర్యచంద్రరావు, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, పరిపాలనాధికారి వి.ఎస్.ఆర్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

# నేడు రాజాం, లావేరుల్లో 5కె రన్

ప్రజాశక్తి- రాజాం

రాజాంలో ఆదివారం ఉదయం జిల్లా క్రీడలశాఖ ఆధ్వర్యాన 5కె రన్ నిర్వహిస్తున్నామని జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ జిఎంఆర్ఐటి నుంచి తృప్తి రీసార్ట్స్ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

**లావేరు** : మండల కేంద్రం లావేరు, సుభద్రాపురం కూడలి నుంచి వెంకటాపురం వరకు 5కె రన్ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామని ఎంపిడిఒ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. విజేతలకు ఈ నెల 11వ తేదీన లావేరు జెడ్‌పి పాఠశాలలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

## ఘనంగా సీమంతాలు

సంతకవిటి: మండలంలోని మంతెనలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, తులసిలు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఒ వేణుగోపాలనాయుడు పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లోని గర్భిణులకు ప్రతినెలా రక్త పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా మేరకు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు పాలు, పండ్లు, జాకెట్లు, పౌష్టికాహార పదార్థాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలయ్య, ఎంపిటిసి రామిచంద్రినాయుడు, డిటి గౌడ్, ప్రాథమిక వైద్యాధికారి ఎ.భార్గవ్ పాల్గొన్నారు.


సీమంతాలు చేస్తున్న అధికారులు

# 'జన్మభూమి'తోనే సమస్యల పరిష్కారం

**రణస్థలం** : ప్రజా సమస్యలపై అర్జీలు అందించాలని, ఆ సమస్యలపై స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెల్లురాయి, అర్జునవలస, తిరుపతిపాలెం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.ధర్మారావు, వైస్ ఎంపిపి దుమ్ము అశోక్, నాయకులు డిజిఎం ఆనందరావు, తహశీల్దార్ కె.శ్రీరాములు, ఎంపిడిఒ యు.కుమార్ పట్నాయక్, ఎంఇఒ ఎ.త్రినాథరావు, ఎఒ రమేష్‌నాయుడు, ఉపాధిహామీ ఎపిఒ సత్యవతి పాల్గొన్నారు.


రణస్థం : ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

## 'జన్మభూమి' మాకొద్దు

**సంతకవిటి:** మండలంలోని జావాం, వాల్తేరు, మంతెన, జి.ఎన్.పురం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి మాకొద్దని ఆయా గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామాలకు సరైన రోడ్లు తాగునీటి సమస్య పరిష్కరించడం లేదన్నారు. జన్మభూమిలో వృద్ధులు, వితంతువులు పించన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకు మంజూరు చేయలేదని ఆందోళన చేశారు. ఉపాధి కూలీలకు డిమస్టర్లు ఫీల్డుఅసిస్టెంటు వేయకుండా వేరే వ్యక్తి మస్టర్లు వేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వాల్తేరులో పింఛన్లు, ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ఆందోళన చేశారు. ఎంపిడిఒ వేణుగోపాలనాయుడు, తహశీల్దార్ సురేష్, ఎఒ రంగారావు, హౌసింగ్ ఎఇ రాజమోహన్, వైద్యాధికారులు భార్గవి, పిఆర్‌జెఇ ప్రభాకర్, పురుషోత్తం పాల్గొన్నారు.


సంతకవిటి : ముందు ఆందోళన చేస్తున్న మంతెన గ్రామస్తులు

## కాలుష్యంపై ఫిర్యాదు

మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న పరిశ్రమల వల్ల కాలుష్యం వెలువడి గ్రామం ఉండలేకపోతున్నామని తిరుపతిపాలెంకు చెందిన గ్రామస్తులు జన్మభూమి గ్రామసభలో ఫిర్యాదు చేశారు. అలాగే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# జన్మభూమి గ్రామసభ బహిష్కరణ

ప్రజాశక్తి-కోటబొమ్మాళి

గత నాలుగు విడతలుగా జరిగిన జన్మభూమి గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులకు, సమస్యలకు పరిష్కారం లభించలేదని అందుకే ప్రాధాన్యత లేని అధికార పక్షానికి అనుకూలంగా నిర్వహిస్తున్న ఐదో విడత జన్మభూమిని బహిష్కరిస్తున్నట్లు మండలంలోని యలమంచిలి సర్పంచ్ కవిటి అమ్ములమ్మ, ఉప సర్పంచ్ హనుమంతు గోవిందరావు తెలిపారు. శనివారం యలమంచిలి పంచాయతీలో తహశీల్దార్ వాన శివబ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన జన్మభూమి-మా ఊరు గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు తీరుపై యలమంచిలి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అభివృద్ధి పట్ల అధికార తెలుగుదేశం పార్టీ వివక్ష చూపుతోందని దానిని విడనాడాలని అధికారులను కోరారు. అనంతరం తర్లిపేట పంచాయతీలో తహశీల్దార్ బృందం జన్మభూమి -మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురుకు పింఛన్లు, రేషన్‌కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు, ఎం.రామకుమార్ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని వాండ్రాడ పంచాయతీలో ఎంపిడిఒ ఎం. రేణుక అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఉపాధి హామీ సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు ఏడాది క్రితం ప్రభుత్వం ఆదేశాలత మేరకు ఇంకుడుగోతులు తవ్వితే వాటికి నేటి వరకు బిల్లులు చెల్లించలేదని వారంతా ఆరోపించారు. అలాగే అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. అనంతరం ఈ బృందం చిన్నబమ్మిడి పంచాయతీ గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జె.అనూరాధ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సభలో మరుగుదొడ్ల అవశ్యకతపై విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటిక నృత్యాలు అందరిని అలరించాయి. ఈ గ్రామ సభకు ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి, ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, సర్పంచ్ చల్ల జయలక్ష్మి, పైల తవిటయ్య, దమయంతి, బి.రాజు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-జలుమూరు

మండలంలోని కరవంజ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 2018-19 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ బాలమురళీకష్ణ శనివారం తెలిపారు. ఈ నెల పది నుంచి ఫిబ్రవరి 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు నాలుగు, ఐదు తరగతులను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉండాలని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రవేశ పరీక్షను ఈ ఏడాది ఏప్రిల్ ఎనిమిదిన నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులైన ఒబిసి విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.50 ఫీజును నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు మోడల్ పాఠశాలను సంప్రదించాలని ప్రిన్స్‌పల్ తెలిపారు.



ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## నందిగాంలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి-నందిగాం

స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాసనసభ శిబిరంలో భాగంగా శనివారం పాఠశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాలను కాలనీలోని వీధులను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి విజయలక్ష్మి ఉపాధ్యాయులు వైకుంఠరావు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డిఇఇ

## నాణ్యతా ప్రమాణాలు పరిశీలన

ప్రజాశక్తి-జలుమూరు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాణ్యత ప్రమాణాల నియంత్రణ డిప్యూటీ ఇఇ కెవివి ప్రసాదరావు సూచించారు. శనివారం ఆయన సైరిగాంలో గ్రామంలో జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయనతోపాటు పంచాయతీరాజ్ ఇఇ బగ్గు నరసింగరావు, జెఇ టి.శ్రీధర్, కాంట్రాక్టర్ ముద్దాడ. శ్రీనివాసరావు ఉన్నారు.

## జన్మభూమిలో పశువైద్య శిబిరాలు

**కోటబొమ్మాళి:** ఈ నెల రెండు నుంచి 11 వరకు టెక్కలి నియోజకవర్గంలో జరుగుతున్న జన్మభూమి- మా ఊరు గ్రామ సభల్లో భాగంగా ఉచిత పశువైద్య శిబిరాలను పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోటబొమ్మాళి మండలంలోని తిలారులోనూ, సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలోనూ, మర్రిపాడు, టెక్కలి మండలం నర్సింగపల్లిలో, నందిగాం మండలం పెద్దతామరాపల్లి పంచాయతీల్లో పశు వైద్యశిబిరాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎంపిటిసి వి.కామేశ్వరావు, పశువైద్యాధికారి డాక్టర్ ఎ.రామకుమార్, వ్యవసాయ మార్కెట్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి-పోలాకి

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని దీర్ఘాశి, మబగాం,చీడివలస, వనతిమండలం తదితర పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దీర్ఘాశి గ్రామసభలో కలెక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖాధికారులు ఎలా విధులు నిర్వర్తిస్తున్నారనేది ప్రజలే నిర్ణయించాలని కలెక్టర్ సభలో పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖాధికారులతో సమీక్షించారు. గ్రామాలకు 104 చంద్రన్న సంచార చికిత్స వాహనాలు ఏ మేరకు వస్తున్నాయి, వాటి సేవలు ఎలా ఉన్నాయో తెలియజేయాలన్నారు. అలాగే ఆశలు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలకు ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారని ప్రజలనుద్దేశించి కలెక్టర్ అడిగారు. జన్మభూమిలో ప్రధానాంశాలైన గ్రామీణ ప్రాంతంలో మౌలిక వసతులు, సౌకర్యాలపై చర్చించారు. ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సక్రమంగా చేయాల్సిన భాద్యత అధికారులపై ఉందని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీర్ఘాశి పంచాయతీలో రూ.15 లక్షలతో అండర్ డ్రెయినేజీ పనులు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే రూ.44 లక్షలతో సిసి రహదారుల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. దీర్ఘాశిలో పార్కును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎఎంసి చైర్మన్ బి.భాస్కరరావు, వంశధార ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు ఎం.వెంకటఅప్పలనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఎస్ వసంతకుమార్, డిఎంహెచ్ఒ సనపల తిరుపతిరావు, ఎంపిడిఒ అలివేలుమంగమ్మ, ఇఒపిఆర్డీ జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ధనంజయరెడ్డి

## నేడు ఆ పాఠశాలలు తెరవాలి

**జలుమూరు:** మండలంలోని యలమంచిలి, కొండపోలవలస, హుస్సేనుపురం, చిన్నదూగాం పంచాయతీల్లో ఆదివారం జన్మభూమి జరుగనున్న నేపథ్యంలో ఆయా పంచాయతీల పరిధిలోని పాఠశాలలను తప్పనిసరిగా తెరవాలని మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు తెలిపారు.

## నేడు 5కె రన్

**జలుమూరు:** మండలంలోని చల్లవానిపేట జంక్షన్ నుంచి తమ్మయ్యపేట వరకు ఆదివారం 5కెరన్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.వాసుదేవరావు శనివారం తెలిపారు. చల్లవానిపేట జంక్షన్‌లో ఆదివారం ఉదయం ఆరు గంటలకు రన్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ 5కె రన్‌లో మండలంలోని ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బెదిరించడం తగదు

**సంతబొమ్మాళి:** సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే తోలు తీస్తా, ఖబడ్దార్ అంటూ సిఎం వ్యాఖ్యలు చేయడం తగదని మత్స్యకారులు మండిపడుతున్నారు. శనివారం మేఘవరంలో ఆ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్యకారుల సంఘం అధ్యక్షులు సూరాడ రాజారావు మాట్లాడుతూ విశాఖలో మత్యకార నాయకులు పట్ల చంద్రబాబు దురుసుగా వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. మత్స్యకారుల కారణంగానే రాష్ట్రంలో టిడిపి గెలిచిందని చంద్రబాబు అంగీకరించారని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పిస్తామనీ, ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తామనీ, 50 ఏళ్ల దాటిన మత్స్యకారులకు పింఛన్ అందజేస్తామని ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మత్స్యకారుల ఉద్యమానికి మద్దతు ఇస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు సిఎంపై ఒత్తిడి తీసుకొచ్చి మత్స్యకారులను ఎస్టీలో చేర్పించాలన్నారు. చంద్రబాబు కారణంగా ఉద్యమం ఉధృత రూపం దాల్చే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబుకు, ఆ పార్టీ మంత్రులకు మత్స్యకారుల సత్తా చూపిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి సూరాడ బీమారావు, జిల్లా మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రాజారావు

## నందిగాంలో జన్మభూమి

ప్రజాశక్తి-నందిగాం

వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బాలకష్ణ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రామపురం పంచాయతీలోని రామపురం గ్రామంలోనూ, రాత పాడు,కొత్త అగ్రహారం గ్రామంలోనూ, మర్లపాడు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. జన్మభూమి ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తెలపారు. సర్పంచ్ దట్టి శ్రీనివాస్, ధనంజయరావు, ఎంపిడిఒ, తహశీల్దార్ ఎస్వీ.నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, టిడిపి అధ్యక్షులు అజయకుమార్, ప్రసాదరావు తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

## వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్

ప్రజాశక్తి-నందిగాం

మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎవరి కోసం ఏర్పాటు చేశారో ముందు రైతులకు తెలియజేయాలని వైసిపి టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తిలక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది తప్పా ఆ కేంద్రాల్లో ఏ ఒక్క రైతు ధాన్యాన్ని కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. దళారులతోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని ఈ విధానాన్ని మాత్రం స్వస్తి పలికే నేరుగా రైతు వద్ద నుండే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రెండు నెలల క్రితం మంత్రి ప్రకటించినా ఎక్కడా కొన్న దాఖలాలు లేవని ఆయన అన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎర్ర చక్రవర్తి, నందిగం ఎంపిటిసి సభ్యులు నడుపూరు శ్రీరామ్మూర్తి , శివరాంపురం జోగారావు, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జె.జయరాం. వైసిపి నాయకులు.రాజు తదితరులున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పేరాడ తిలక్

# కష్టపడితేనే మంచి ఫలితాలు

## ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అదృష్టం పది శాతమేనని, కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శనివారం ఉమెన్స్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అదృష్టం, అవకాశాలు కోసం ఎదురుచూడకూడదని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలామంది బాలికలు మంచి కంటే చెడు వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తే నామోషీగా భావించే స్థితికి తల్లిదండ్రులు వచ్చారన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమర్థవంతమైన ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారని, దీన్ని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. నాటి కలెక్టర్ చొరవతో ఆర్అండ్‌బి ప్రాంగణంలో ఎకరా స్థలాన్ని కాలేజీకి మంజూరు చేశామన్నారు. వచ్చే ఏడాది వార్షికోత్సవం నాటికి కొత్త భవనంలో తరగతులు నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనిపై తిరుగుబాటు చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిపి డి.ఢిల్లీరావు, ఎఎంసి ఛైర్మన్ సహదేవరెడ్డి, టిడిపి నాయకులు సిహెచ్.తులసీదాసురెడ్డి, కాళ్ల ధర్మారావు, హెచ్ఎం పద్మవల్లి, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

**వజ్రపుకొత్తూరు:** మండలంలో బైపల్లి, బాతుపురం, రెయ్యిపాడు గ్రామాలకు చెందిన తామాడ జోగులు, తామాడ ముఖలింగం, కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. శనివారం వైసిపి పలాస నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సీదిరి అప్పలరాజు బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతోపాటు వైసిపి నాయకులు దువ్వాడ శ్రీకాంత్, మంత్రి హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### మోటారు వాహన చట్టం సవరణను ఆపాలి

**పలాసరూరల్:** మోటారు వాహన చట్టం సవరణను ఆపాలని కోరుతూ శనివారం సంపతి వినాయక ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తహశీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రవాణా రంగం కార్పొరేటీకరణ చర్యలను కేంద్రం విరమించుకోవాలని తెలిపారు. లక్షలాది మంది కార్మికుల ఉపాధిని దెబ్బతీసే చట్ట సవరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్.గణపతి, సంపతి వినాయక ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.గణపతి, కె.బాబూరావు, కోశాధికారి కె.దానయ్య, సభ్యులు జోగారావు, మోహన్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**కంచిలి:** స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ఇన్ఒన్ పుస్తకాలను అందజేశారు. జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్ట్ మేనేజర్ సింహాచలం హెచ్ఎంకు పుస్తకాలను అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక పెద్దలు, యువజన సంఘాలు, ట్రస్ట్‌లు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్, టి.రవి, టి.జానకిరావు, లోలాక్షి పాల్గొన్నారు.

# మత్స్యకారులను కించపరచడం బాధాకరం

ప్రజాశక్తి-పలాస

ఇచ్ఛాపురంలో పర్యటించిన చంద్రబాబు మత్స్యకారులకు ఎటువంటి హామీలు ఇవ్వలేదని, విశాఖలో మత్స్యకారులను కించపరిచేలా మాట్లాడడం బాధాకరమని మత్స్యకారుల ఎస్‌టి సాధన కమిటీ సభ్యులు అంబటి ఆనందరావు, పి.రాజారావు అన్నారు. శనివారం లేబరుకాలనీలో మత్స్యకారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని 25 రోజులుగా శ్రీకాకుళంలో మత్స్యకారులు రిలే నిరాహారదీక్షలు చేస్తుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం దారుణమన్నారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్పించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సిహెచ్.నరహరి, దేవరాజు, శాంతమూర్తి, కాళిదాసు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు:** చంద్రబాబు మత్స్యకారులతో వరిొట్లాడిన తీరు సిగ్గుచేటని మత్స్యకార సంఘం నాయకులు పుక్కళ్ల గురయ్యానాయుడు, వంక రాజు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వి.గణేష్‌పై సిఎం ప్రవర్తించిన తీరు బాధాకరమన్నారు. మత్స్యకారుడు ఎమ్మెల్యే కావడం సిఎం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. కేవలం మత్స్యకారుల ఓట్లు కోసమే పాటుపడుతున్నారు తప్ప వారి అభివృద్ధికి చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో సింహాచలం, అంబటి రామలింగం, ఎర్రయ్య, కరణ్‌కుమార్, తాతయ్య, వి.జోగారావు, రెయ్యి రమేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

**సోంపేట:** సిఎం మత్స్యకారులను కించపరిచేలా మాట్లాడడం సరికాదని మత్స్యకార నాయకులు మద్దు రాజారావు, సూరాడ పాపారావు, లోకనాథం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు మత్స్యకారులను ఎస్‌టిలో చేర్పించాలని ముఖ్యమంత్రిని కోరేందుకు వెళ్తే అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

# పరిసరాల పరిశుభ్రత ఆవశ్యం

**పలాస:** పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ పరిసరాలు చెత్తా పేరుకుపోయిందని, దుర్వాసనను భరించలేకపోతున్నామని దుకాణదారులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ రమేష్‌నాయుడుతో కలిసి బస్టాండ్‌ను శనివారం పరిశీలించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం వేయరాదని దుకాణదారులకు సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, బి.శ్రీనివాసరావు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

# అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ఇచ్ఛాపురం:** మున్సిపాలిటీలోని 10, 11 వార్డుల్లో శనివారం జన్మభూమి-మాఊరు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 11వ వార్డులో జరిగిన సభలో వార్డు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ అధికారుల తీరును తప్పుపడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నా సమస్యలను పరిష్కరించకపోవడం సరికాదన్నారు. ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పదో వార్డులో ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ ఆశి మీనాకుమారి, కమిషనర్ రవిబాబు, త్రివేణి, కాళ్ల ధర్మారావు, సిహెచ్.లోహిదాసు, ఎఇ ఇమ్మాన్యుయల్, ఎ.లీలారాణి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మండలంలో పాయితారి, బొడ్డబడ గ్రామ పంచాయతీల్లో శనివారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. సభలో ప్రత్యేకాధికారి లవరాజు, జెడ్‌పిటిసి లింగరాజురెడ్డి, ఎఎంసి ఛైర్మన్ సహదేవరెడ్డి, టిడిపి నాయకులు ఎల్.పద్మనాభం, దీనబంధురెడ్డి, డి.కామేశ్వరరావు, గణపతి, ఎంపిడిఒ సత్యం పాల్గన్నారు.

**వజ్రపుకొత్తూరు:** గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపిపి జి.వసంతరావు అన్నారు. శనివారం అమలపాడు, ఉద్దానం రామకృష్ణాపురం, కంబాలరాయుడుపేటలో జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. ఉద్దానం రామకృష్ణాపురం, అమలపాడులో జరిగిన సభలో భూమి వివరాలు తప్పుగా నమోదయ్యాయని, వ్యవసాయ రుణాలు పొందే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించలేదని, సకాలంలో బిల్లులు చెల్లించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభలో సర్పంచ్‌లు చింత రజిని, డి.వల్లప్పగారి తులసి, కంబాల దానేషు, చింత నారాయణ, షణ్ముఖరావు, ఎంపిడిఒ వి.తిరుమలరావు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ సనపల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**పలాస:** మూడవ వార్డు పరిధిలోని తాళభద్ర మండపం వద్ద, 11, 12 వార్డులకు సంబంధించి శివానంద ఆశ్రమం వద్ద శనివారం కమిషనర్ రమేష్‌నాయుడు అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ జి.సూర్యనారాయణ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్.కామేశ్వరరావు, ఎస్.సురేష్‌బాబు, ఎం.కృష్ణారావు, గాలి కృష్ణారావు, పి.లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

**మందస:** ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు గౌతు శిరీష, ఎంపిపి దాసరి జయలక్ష్మీ అన్నారు. మండలంలోని అంబుగాం, లోహరిబంద, భేతాళపురం, దున్నూరు, గ్రామాల్లో శనివారం జన్మభూమి-మాఊరు నిర్వహించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ వి.శ్యామసుందరరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి బి.రాజేశ్వరరావు, ఆర్ఐలు సునంద, అమర్‌నాథ్, ఇరిగేషన్ ఎఇ శ్రీనువాసరావు, ఎఒ పోలారావు, సూర్యారావు, ఉదయ్ పాల్గొన్నారు.

### రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయండి

**కంచిలి:** ఎస్ఆర్‌సిపురం, ఎం.ఎస్.పల్లి గ్రామాల మధ్య రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు జన్మభూమి-మాఊరులో అధికారులను కోరారు. శనివారం ఈ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంఎస్‌పల్లిలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ రైల్వే క్రాసింగ్ వద్ద రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, తక్షణం అండర్ పాసేజ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపిడిఒ చల్లా శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి కె.సత్యారావు, ఎంపిపి ఇప్పిలి లోలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

### పనులు వేగవంతం చేయండి

**వజ్రపుకొత్తూరు:** చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. కంబాలరాయుడుపేటలో చేపడుతున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఈ కేంద్రానికి తరలిస్తే ఎరువుగా తయారవుతుందని, దీన్ని విక్రయించగా వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీలకే చెందుతుందన్నారు. ఎంపిడిఒ వి.తిరుమలరావు మాట్లాడుతూ మండలానికి 18 కేంద్రాలు మంజూరయ్యాయని, ఇప్పటివరకు డోకులపాడు, వజ్రపుకొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనులు పూర్తయ్యాయన్నారు. ఒక్కొక్క కేంద్రం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.2.80 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంబాల దానేష్, పశువైద్యాధికారి ఎం.పాపారావు, హౌసింగ్ ఎఇ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

### నేడు రామారావు సంతాప సభ

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు పలాస-కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ప్రజాశక్తి దినపత్రిక పలాస డివిజన్ ఇన్‌ఛార్జి జన్ని రామారావు సంతాప సభ నిర్వహిస్తున్నారు. ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు డి.మహరణ, అధ్యక్షులు డి.విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఎస్.రమేష్ శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. సభకు జంటపట్టణాల్లోని ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. రామారావు కుటుంబసభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

### అలరించిన చిన్నారుల నృత్యాలు

**వజ్రపుకొత్తూరు:** జన్మభూమి-మా ఊరులో భాగంగా మండలంలోని అమలపాడు, కంబాలరాయుడుపేట పాఠశాలల్లో శనివారం చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించామని ఎంపిడిఒ వి.తిరుమలరావు, తహశీల్దార్ సనపల రమణయ్య అన్నారు. ఆర్.కె.పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలకు చేసిన నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రజిని, షణ్ముఖరావు, కంబాల దానేషు తదితరులు పాల్గొన్నారు.

### చెంబుకు శవయాత్ర

ప్రజాశక్తి - పలాస

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జన్మభూమి-మా ఊరులో భాగంగా శనివారం చెంబుకు శవయాత్ర నిర్వహించారు. కళాశాల నుంచి పురవీధుల్లో శవయాత్ర నిర్వహించారు. నినాదాలు చేశారు. ప్రతి కుటుంబమూ వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల సమన్వయకర్త పాపారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైసిపి మందస పట్టణ అధ్యక్షులుగా జయప్రకాష్

**మందస:** వైసిపి మందస పట్టణ అధ్యక్షునిగా బరాటం జయప్రకాష్‌ను నియమించినట్లు వైసిపి నాయకులు మెట్ట కుమారస్వామి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యదర్శులుగా తలగాన హరికృష్ణ, ఎండ సూర్యారావు, కంచి బెహరాను నియమించినట్లు ఆయన తెలిపారు.

### బడిరుణం తీర్చుకుందాం

ప్రజాశక్తి - సోంపేట

బడి రుణం తీర్చుకుందామని పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు డి.కృష్ణారావు అన్నారు. శనివారం బారువలోని ప్రాథమిక పాఠశాలకు కుర్చీలు నిమిత్తం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. దున్న ప్రసాద్ అనే వ్యక్తి ప్రతిరోజూ పాఠశాలకు మినరల్ వాటర్ అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పుణ్యావతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

## మత్స్యకారులపై బాబుది కపట ప్రేమ

### ధర్మాన కృష్ణదాస్

**శ్రీకాకుళం సిటీ:** సిఎం చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలన్నీ ప్రజలు మొసగించడానికేనని వైసిపి రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో జిల్లా మత్స్యకార ఎస్‌టి సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు నిర్వహిస్తున్న రిలేదీక్షలు 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి, మాట్లాడారు. మత్స్యకారులకు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే వారిని బెదిరించడం చంద్రబాబు నైజానికి నిదర్శనమన్నారు. హామీ అమలు చేయాల్సిన వ్యక్తి ప్రజలను బెదిరించడంలో చరిత్రలో ఎక్కడా లేదన్నారు. నియంతలా వ్యవహరిస్తూ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని విమర్శించారు. మత్స్యకారుల ఒట్లతో పదివిని అనుభవిస్తున్న చంద్రబాబుకు ప్రజాసంక్షేమం పట్టడం లేదన్నారు. మత్స్యకారులకు మెరుగైన జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయడంలేదని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిస్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. మత్యకారులకు ఎమ్మెల్సీ పదవిని ఇస్తానన్న హమీ వాగ్దానంగానే మిగిలిందన్నారు. ఎస్‌టి జాబితాలో చేర్చుతానని ఇచ్చిన హమీకి తీసుకున్న చర్యలు ఏమిటో స్పష్టం చేయాలన్నారు. మత్స్యకారులు సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. మత్స్యకారుల డిమాండ్ల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్‌కు వైసిపి సంపూర్ణ మద్దతునిచ్చి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కరిమి రాజేశ్వరరావు మత్స్యకార సంఘం నాయకులు ఎం.గురుమూర్తి, ఎం.లక్ష్ముడు, ఎం.రామారావు తదితరలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని

## జాతీయ మహిళా టీచర్ల దినోత్సవంగా ప్రకటించాలి

**యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి**

**ప్రజాశక్తి - రణస్థలం**

జనవరి 3వ తేదీన సావిత్రిభాయిపూలే జయంతిని జాతీయ మహిళా టీచర్ల దినోత్సవంగా ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సావిత్రిభాయిపూలే జయంతి వేడుకల్లో భాగంగా యుటిఎఫ్ రణస్థలం మండల శాఖ ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుండి డిగ్రీ వరకు ఆమె జీవత చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చాలన్నారు. ఆ నాడు ఆమె హంటర్ విద్యా కమిషన్‌ను వేయించి, పాఠశాలల ఏర్పాటు, ఉపకార వేతనాలు, బాలికా విద్యవంటి అంశాలను ప్రతిపాదించి విద్యారంగంలో సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. ఈనాడు విద్యా రంగంలో పాలకులు అమలు చేస్తున్న సంస్కరణలతో బాలికలు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలకు పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిపడే విధంగా నిర్మించడం, రన్నింగ్ వాటర్ కల్పించడం, నాప్‌కిన్స్‌ను ఉచితంగా సరఫరా చేయాలని, వీటిపై జిఎస్‌టి రద్దు చేయాలని కోరారు. విద్యకు బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలని కోరారు. సభలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ



మాట్లాడుతున్న కె.విజయగౌరి

సభ్యులు జి.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి పి.అప్పారావు, జిల్లా, మండల నాయకులు కె.ప్రసూన, జె.వెంకటేశ్వరి, ఐ.వేణుమాధవి, సి.హెచ్ అనురాధజ్యోతి, ఎ.సుజాత, ఎస్.తులసీదాస్, డి.కోటేశ్వరరావు, ఎస్.నారాయణరావు, బి.రాజారావు, ఎల్.కోదండరామయ్య, టి.శంకరరావు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న వెటరన్ క్రీడాకారుడు





పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

## ఉరకలేసిన ఉత్సాహంతో..

**రెండో రోజూ కొనసాగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు**

**ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ**

ఉరకలేసిన ఉత్సాహంతో వెటరన్ క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో కేంద్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు స్మారక 37వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండో రోజు శనివారం రన్స్, జంప్స్, త్రోస్‌లో వెటరన్ క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. 12 వయో విభాగాల్లో 20 అంశాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా రెండో రోజు పోటీలను నిర్వహించారు. ఆదివారం చివరి రోజు అన్ని అంశాల్లోనూ ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలకు పతకాలు, జ్ఞాపికలు, చాంపియన్‌షిప్ ట్రోఫిని అందించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఖాశీంఖాన్, చల్లా విజయకుమార్, వై ఫౌండేషన్ అధ్యక్షులు గంటా స్వామిబాబు, తదితరులు పర్యవేక్షించారు.



డిస్కస్ త్రో చేస్తున్న క్రీడాకారుడు

## కిడ్నీ రోగులకు తాగునీరు అందిస్తాం

### మంత్రి అచ్చెన్నాయుడు

**ప్రజాశక్తి - పలాస రూరల్**

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ప్రతి గ్రామానికీ ఈ నెలాఖరు నాటికి ఎన్‌టిఆర్ సుజల ద్వారా తాగునీరు అందిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని రంగోయి గ్రామంలో శనివారం మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. ముందుగా ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సుజల పథకం ద్వారా రెండు రూపాయలకే 25 లీటర్ల తాగునీరు అందిస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరూ కార్డులు పొందాలన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో అనేకమంది కిడ్నీ వ్యాధితో మరణిస్తున్నారని, కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తుందన్నారు. ఉచిత మందులు పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.పది కోట్లు మంజూరు చేసిందన్నారు. కిడ్నీ బాధితులు సౌకర్యార్థం ఉద్దానం ప్రాంతాల్లో ఆస్పత్రులు ఏర్పాటుకు



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

తనవంతు కృషి చేస్తానన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును జూలై నాటికి పూర్తి చేసి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీటితోపాటు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తామన్నారు. సాగునీటి కాలువలు లేకపోతే లిఫ్ట్‌లు ద్వారా భూములకు సాగునీరందిస్తామన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.24 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. వంశధారకు రూ.434 కోట్లు, ఆఫ్‌షోర్‌కు రూ.464 కోట్లు కేటాయించి రైతులను ఆదుకుంటుందన్నారు. కిడ్నీ బాధిత గ్రామాల్లో రూ.12 కోట్లు వ్యయంతో వాటర్‌స్కీమ్‌లు ఏర్పాటుచేసిందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం టిడిపి మండల కార్యదర్శి కుత్తుం లక్ష్మణకుమార్ ఉద్దానంలో పిహెచ్‌సి ఏర్పాటుచేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఉద్దానం ప్రాంతాలకు వంశధార నీరు అందించాలని, జీడి, మామిడికి బోర్డు ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. సభలో వంక నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి డి.కృష్ణమూర్తినాయుడు, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, గురుదాసుపురం ఎంపిటిసి బి.రూపావతి, సర్పంచ్ బి.శాంతమ్మ, మాజీ ఎంపిపి ప్రతినిధి డి.నర్సింగరావు, కూన సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**చిన్నారితో ఎంపీ ముచ్చట్లు**

రంగోయిలో నిర్వహించిన జన్మభూమిలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఓ చిన్నారితో ముచ్చటించారు. సభకు ముందుభాగాన గర్భిణులు, బాలింతలు కూర్చొన్నారు. ఒక బాలింత వద్ద ఉన్న చిన్నారి అల్లరి చేయడంతో తన దగ్గరకు తీసుకుని కాసేపు ఆటలాడించారు.

## పోలవరం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ**

పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు డోల జగన్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 7 నుంచి 9 వరకు తూర్పు గోదావరిలో నిర్వహించే మహా పాదయాత్ర పోస్టర్‌ను శనివారం స్థానిక ఇందిరా విజ్ఞాన భవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి సారథ్యంలో ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పాదయాత్ర మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమైందన్నారు. బిజెపి, టిడిపి చిల్లర రాజకీయాలు మాను కొని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చౌదరి సతీష్ , సనపల అన్నాజీరావు, నంబాల రాజశేఖర్, బాన్న రాము, రత్నాల నరసింహమూర్తి, ఎంఎ భేగ్, కొంక్యాణ మురళీ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు